@vaartanews @mvnewstv
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.mivaartanews.com
TGBIL/25/A0512
మంగళవారం
06 అక్టోబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
సంపుటి : 02
సంచిక :94
పేజీలు : 12 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్‌సీ ఇంచార్జ్‌లు, మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికి అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE



## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్దత ఏర్పడింది

- భారత్-అమెరికా వాణిజ్య చర్చలపై నిర్మలా సీతారామన్ కీలక వ్యాఖ్యలు
- ప్రస్తుతం వాణిజ్యం భారత్‌కే అనుకూలంగా ఉందని వెల్లడి
- వాణిజ్య లోటును తగ్గించుకోవాలని అమెరికా భావిస్తోందని వ్యాఖ్య
- ఈయూ ఒప్పందాన్ని విజయవంతమైన ఉదాహరణగా చూపిన ఆర్థిక మంత్రి

# బోగస్ ఫారం-7లపై చర్యలు తీసుకోండి

- సీఈవో సుదర్శన్‌రెడ్డి ఆదేశం
- అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు ఫారం-7ని దుర్వినియోగం చేసిన వారిపై కఠిన చర్యలు
- తెలంగాణ సీఈఓ సుదర్శన్ రెడ్డి అధికారులకు జారీ
- అనర్హులకు ఓటు ఉన్నట్లయితే అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలగించాలని కోరుతూ ఫారం 7 సమర్పించాల్సి ఉంటుంది.
- ఫారం-7లపై క్షుణ్ణంగా విచారణ జరిపిన తర్వాతే ఓటు తొలగించాలని స్పష్టం
- ఫారం-6ను వినియోగించి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు



హైదరాబాద్

ఓట్ల తొలగింపు కోసం బోగస్ ఫారం-7 సమర్పిస్తే చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్లను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో ముందే ప్రింట్ చేసిన ఫారం-7లు భారీగా సమర్పిస్తున్నట్లు సమాచారం అందుతోందని సీఈవో తెలిపారు. ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇస్తే చట్ట ప్రకారం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అనర్హులకు ఓటు ఉన్నట్లయితే అభ్యంతరం వ్యక్తం చేస్తూ తొలగించాలని కోరుతూ ఫారం 7 సమర్పించాల్సి ఉంటుంది. అయితే హైదరాబాద్‌లోని ముషీరాబాద్, గోషామహల్, - మిగతా10లో



# ఏడాదిన్నరలోగా భూసర్వే పూర్తి

- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సమీక్షలో మంత్రి పొంగులేటి
- ఎప్పుడో 125 ఏళ్ల క్రితం భూసర్వే జరిగింది
- ఇప్పటికీ భూ సంబంధిత వివాదాలు కొనసాగుతున్నాయి
- భూముల సమగ్ర సర్వేతో భవిష్యత్‌లో ఎలాంటి భూ వివాదాలు తలెత్తవు
- గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలి
- అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తాం



## చట్టం ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి

- న్యాయంలో మానవీయ కోణం కీలకం
- సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- న్యాయవ్యవస్థ పనితీరుపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు
- చట్టం అందరికీ అర్థమయ్యేలా ఉండాలని, న్యాయంలో కరుణ కీలకం అని స్పష్టం
- ముగ్గురు హైకోర్టు చీఫ్ జస్టిస్‌లను సుప్రీం కోర్టు న్యాయమూర్తులుగా నియమించిన కేంద్రం

# రసవత్తరంగా ముక్కోణపు పోరు

- ఈ నెల 9న ఆర్టీసీలో గుర్తింపు ఎన్నికలు
- తెలంగాణ రోడ్డు రవాణా సంస్థలో 10 సంవత్సరాల తర్వాత గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నారు
- గెలుపే లక్ష్యంగా కార్మిక సంఘాలు అడుగులు వేస్తున్నాయి
- అధికార కాంగ్రెస్ పార్టీ టీడబ్ల్యూయూకు మద్దతు ప్రకటించడంతో ప్రాధాన్యం సంతరించుకొంది.




## సింగరేణి కార్మికులకు
# కేంద్రం బోనస్



- సింగరేణి కార్మికులకు దసరా, దీపావళి బొనాంజా
- ఒక్కో ఉద్యోగికీ రూ.1,10,250 బోనస్
- రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించింది.

హైదరాబాద్

దసరా, దీపావళి పండుగలను పురస్కరించుకుని సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్‌ను ప్రకటించింది. ఈ మేరకు ఒక్కో ఉద్యోగికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయించినట్లు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, సింగరేణి భవిష్యత్తు కోసం యాజమాన్యం, కార్మికులు - మిగతా10లో



## ఇది అస్థిరత యుగం

- కానీ సవాళ్లను అధిగమిస్తామనే నమ్మకం ఉంది’
- కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- ప్రపంచం ఘర్షణలు, టారిఫ్స్ అస్థిరతతో ఫ్లక్స్ యుగంలోకి వెళ్తోందన్న జైశంకర్
- భారత్ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొంటుందని ఆశాభావం
- రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ముగింపునకు చర్చలు, దౌత్యమే మార్గమని చెప్పిన విదేశాంగ మంత్రి

# రాష్ట్రాభివృద్ధికి సహకరించండి

- రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి
- ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్!
- నితిన్‌గడ్కరీకి మంత్రి కోమటిరెడ్డి విజ్ఞప్తి
- ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మి మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలి
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి గడ్కరీకి విజ్ఞప్తి చేశారు.
- ఎల్బీనగర్ ఎలివేటెడ్ కారిడార్ మంజురు చేయండి
- 5 రోప్‌వే ప్రాజెక్టులకు అనుమతివ్వాలని విజ్ఞప్తి



హైదరాబాద్

తెలంగాణ కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్రప్రభుత్వం సహకరించాలని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీకి రాష్ట్ర ఆర్?అండ్?బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్? రెడ్డి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ--ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు హైదరాబాద్?లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం, ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిని వేగవంతం చేసేలా పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సాయం అందించాలని ఆయన కోరారు. గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ప్రాంగణంలో జరుగుతున్న ‘చింతన్ శివిర్’-2026 కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి గడ్కరీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ వెంటనే మంజూరు చేయాలని కేంద్రమంత్రి గడ్కరీకి కోమటిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్-65, 6ం2 లేన్ల విస్తరణ, ఆర్?ఆర్?ఆర్ ఉత్తర--దక్షిణ భాగాలు, - మిగతా10లో



## భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

- ఏఐ, వాణిజ్యంలో కలిసి పనిచేస్తాం
- స్విస్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్
- గ్లోబల్ గవర్నెన్స్, డిప్లొమాసీలో భారత్ కీలక శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడి ప్రశంసలు
- 2027 లో జెనీవాలో నిర్వహించే గ్లోబల్ ఏఐ సమిట్‌కు భారత్ భాగస్వామ్యాన్ని కోరిన గై పార్మెలిన్

## సంపాదకీయం

# వేగంగా తగ్గిపోతున్న యువ జనాభా

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా కలిగిన దేశంగా పేరుగాంచిన భారత్‌లో ఇప్పుడు జననాల రేటు భారీగా తగ్గిపోవడం తీవ్ర చర్చకు దారితీస్తోంది. ఒకప్పుడు వేగంగా పెరిగిన జనాభా ఇప్పుడు క్రమంగా క్షీణించడం వైపు అడుగులు వేస్తోంది. తాజా నివేదికల ప్రకారం దేశంలో జననాలు గణనీయంగా పడిపోగా, సంతానోత్పత్తి రేటు కూడా 1.9కి పడిపోయింది. రాబోయే రోజుల్లో యూరప్, తూర్పు ఆసియా దేశాల మాదిరిగా భారత్ కూడా వృద్ధాప్య జనాభా సమస్యను ఎదుర్కొనే దిశగా మారుతుందా అనే దానిపై ఇప్పుడు ఆందోళన వ్యక్తమవుతోంది జనాభా పెరుగుదల నుంచి క్షీణత వైపు మలుపు: దశాబ్దాల పాటు జనాభా విస్ఫోటనం గురించి చర్చించుకున్న మన దేశం, ఇప్పుడు సరిగ్గా వ్యతిరేకమైన పరిస్థితిని ఎదుర్కొంటోంది. 2023 నాటికి దేశంలో జననాల సంఖ్య ఏకంగా 1974 నాటి స్థాయికి పడిపోవడం గమనార్హం. జనాభా స్థిరత్వానికి లేదా వృద్ధికి కనీసం 2.1 సంతానోత్పత్తి రేటు అవసరం కాగా, ప్రస్తుతం అది 1.9కి చేరింది. ఈ గణాంకాలు భవిష్యత్తులో దేశ జనాభా స్వరూపంలో రాబోతున్న పెను మార్పులకు స్పష్టమైన సంకేతాలుగా నిలుస్తున్నాయి. ప్రపంచ దేశాలన్నింటికీ మన దేశమే అతిపెద్ద శ్రామిక శక్తిని అందిస్తుందని గర్వంగా చెప్పుకునేవాళ్లం. కానీ, సంతానోత్పత్తి రేటు ఇలాగే పడిపోతూ వస్తే, రాబోయే కొన్ని దశాబ్దాల్లో మనకు యువ ఉద్యోగుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది. ఒకప్పుడు దేశ అభివృద్ధికి ప్రధాన బలముగా మారిన 'డెమోగ్రాఫిక్ డివిడెండ్' క్రమంగా ముగింపు దశకు చేరుకుని, వృద్ధుల సంఖ్య పెరిగే 'డెమోగ్రాఫిక్ ట్రాన్సిషన్' వైపు భారత్ వేగంగా పయనిస్తోంది. స్థిరపడిన తర్వాతే పెళ్లి చేసుకోవాలనుకుంటారు కొంత మంది. స్థిరపడేసరికి వయసయిపోతుంది. ఇలాంటి సమస్య దేశానికి వస్తే ఎలా ఉంటుంది? ఇప్పుడు భారత్ అలాంటి పరిస్థితులోకి వెళ్తోంది. దేశం ఇప్పటికి అభివృద్ధి చెందుతున్న దేశమే. 2047కి అభివృద్ధి చెందిన దేశంగా మారాలని టార్గెట్ పెట్టుకున్నారు. అప్పటికి ఆ లక్ష్యం సాధించినా దేశం మాత్రం వృద్ధాప్యంలోకి వెళ్లబోతోంది.దక్షిణాదికి చెందిన ముఖ్యమంత్రులు, ముఖ్య నాయకులు ఎక్కువ మంది పిల్లల్ని కనండి.. జనాభాను పెంచండి అని చేసిన ప్రకటనలను చూసి సోషల్ మీడియాలో, సాధారణ చర్చల్లో చాలా మంది తేలిగ్గా నవ్వుకున్నారు. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వేధిస్తున్న ప్రస్తుత కాలంలో మళ్లీ పిల్లల్ని కనమని చెప్పడమేమిటంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. కానీ, ఆ నాయకుల మాటల్లో కేవలం రాజకీయ స్వార్థం మాత్రమే కాదు.. భవిష్యత్ భారతదేశాన్ని ముంచెత్తబోతున్న ఒక పెను జనాభా సంక్షోభం తాలూకు ఆందోళన కూడా దాగి ఉందన్న కఠిన వాస్తవాన్ని ప్రముఖ అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ మూడీస్ తాజా నివేదిక కళ్లకు కట్టింది.భారత్‌లో సంతానోత్పత్తి రేటు ఇప్పటికే స్థిరీకరణ స్థాయిగా భావించే రీప్లేస్‌మెంట్ లెవల్ 2.1 కంటే కిందకు పడిపోయింది. 2024 నాటికే మన దేశంలో 65 ఏళ్లు పైబడిన వారి శాతం 7 దాటి, భారత్ అధికారికంగా ఏజింగ్ దశలోకి అడుగుపెట్టింది. 2049 నాటికి ఈ వాటా 14 శాతానికి పెరిగి ఏజ్డ్ సమాజంగా, ఆ తర్వాత కేవలం 16 ఏళ్ల వ్యవధిలోనే అంటే 2065 నాటికి 21 శాతానికి చేరి సూపర్ ఏజ్డ్ దేశంగా భారత్ మారబోతోంది. అమెరికా వంటి అగ్రరాజ్యానికి ఏజ్డ్ నుంచి సూపర్ ఏజ్డ్ కావడానికి 19 ఏళ్లు, ఇండోనేసియాకు 29 ఏళ్లు పడితే.. భారత్ అత్యంత వేగంగా ఆ విషవలయంలోకి చేరిపోతుంది.ఇక్కడ అసలైన ప్రమాదం వృద్ధుల సంఖ్య పెరగడం ఒక్కటే కాదు. మనం ఎంత సంపన్నమైన తర్వాత వృద్ధులవుతున్నామన్నదే అసలు సమస్య. జపాన్, యూరప్, అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశాలు ముందుగా పారిశ్రామికంగా ఎదిగి, ఆర్థికంగా పరిపుష్టమై, పూర్తిస్థాయిలో ధనిక దేశాలు గా మారిన తర్వాతే వృద్ధాప్య సమాజాలుగా మారాయి. కానీ భారత్ వంటి వర్ధమాన దేశాలు ఇంకా తలసరి ఆదాయంలో అట్టడుగున ఉన్న తరుణంలోనే వృద్ధాప్యంలోకి జారుకుంటున్నాయి. అంటే, ధనిక దేశం కాకముందే వృద్ధ దేశంగా మారే ప్రమాదం మన ముంగిట ఉంది. అత్యంత తక్కువ ఆదాయం ఉన్న దశలోనే కోట్లాది మంది వృద్ధులకు ఉచిత వైద్యం, పెన్షన్లు, దీర్ఘకాలిక సంరక్షణ భారాన్ని ప్రభుత్వాలు మోయాల్సి రావడం దేశ ఆర్థిక వ్యవస్థనే కుదేలు చేసే అంశం.పనిచేసే చేతులు తగ్గడం వల్ల ఉత్పాదకత తగ్గి, పన్నులు కట్టే యువతరం క్షీణిస్తే దేశ అభివృద్ధి చక్రం ఆగిపోతుంది. వినియోగదారులు తగ్గితే మార్కెట్ డిమాండ్ పడిపోయి పరిశ్రమలు నష్టపోతాయి. కేరళ కంటే ప్రస్తుతం చాలా రాష్ట్రాలు తక్కువ సంతానోత్పత్తి రేటును కలిగి ఉన్నప్పటికీ, అక్కడ సుదీర్ఘ కాలంగా సంతానోత్పత్తి రేటు తక్కువగా నమోదవుతోంది... 25 ఏళ్లలోపు జనాభా 37.4% జనాభాలో మూడవ వంతు ఉన్నారు. కేరళలో సంతానోత్పత్తి రేటు 1991 నాటికి 1.8కి పడిపోయింది. ప్రస్తుతం కేరళ (1.7 శాతం) కంటే తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, జమ్మూ కశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్‌లో సంతానోత్పత్తి రేటు 1.6 శాతంగా ఉంది. 1991 నాటికి ఈ రాష్ట్రాల్లో సంతానోత్పత్తి రేటు 3 కన్నా ఎక్కువ ఉండగా.. తమిళనాడులో మాత్రమే 2.2 శాతంగా ఉంది. తత్ఫలితంగా కేరళ కంటే 25 ఏళ్లలోపు జనాభా ఎక్కువ ఉంది.పట్టణ ప్రాంతాల్లో సంతానోత్పత్తి తక్కువగా ఉన్నందున, 25 ఏళ్లలోపు వారి సంఖ్య గ్రామీణ ప్రాంతాల కంటే తక్కువగా ఉంది. పట్టణ ప్రాంతాలకు వలసలు కూడా ఇందులో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. కొన్ని రాష్ట్రాల్లో మహిళల్లో ఎక్కువ ఆయుఃప్రమాణం.. దశాబ్దాలుగా లింగ నిష్పత్తులు క్షీణించడం వల్ల మహిళల్లో 25 ఏళ్లలోపు వారి నిష్పత్తి పురుషుల కంటే తక్కువగా ఉంటుంది. జాతీయంగా 47.4 శాతం ఉన్న పురుష జనాభాతో పోలిస్తే 25 ఏళ్ల కంటే తక్కువ వయస్సు మహిళల శాతం 46.3 శాతంగా ఉంది.దేశానికి లభించిన అతిపెద్ద వరం డెమోగ్రాఫిక్ డివిడెండ్ . ఈ కాలం ముగిసిపోవడానికి మనకు మిగిలి ఉన్న సమయం చాలా తక్కువ. ఈ ముప్పును గుర్తించి హెచ్చరిస్తున్న నాయకులను ఎగతాళి చేస్తూ కాలం గడిపితే.. యువ భారతం అతి త్వరలోనే భరించలేని ఆర్థిక భారంతో కుంగిపోయే వృద్ధ భారతం గా మిగిలిపోవడం తథ్యం.

# బీజేపీ బూచి రాజకీయాలకు ముగింపు



తమిళనాడు రాజకీయాలు ఎప్పుడూ దేశ రాజకీయాలకు భిన్నమైన వైఖరితో నడుస్తుంటాయి. ద్రవిడ భావజాలం, స్వయంప్రతిపత్తి నినాదాలతో దశాబ్దాలుగా కేంద్రంలోని బీజేపీని బద్ధ శత్రువుగా చిత్రీకరిస్తూ నడిచిన తమిళ రాజకీయం.. ఇప్పుడు ఊహించని మలుపు తిరిగింది. ఒకప్పుడు బీజేపీని , కాషాయ రాజకీయాలను తీవ్రంగా వ్యతిరేకించడమే తమిళనాడులో గెలుపు మంత్రంగా ఉండేది. కానీ ఇప్పుడు ఆ భావజాలం కనుమరుగై, అన్ని ప్రధాన శక్తులూ కేంద్రంతో ఘర్షణను పక్కనపెట్టి వ్యూహాత్మక సర్దుబాట్ల వైపు అడుగులు వేస్తున్నట్లు స్పష్టమవుతోంది. రాష్ట్రంలోని ఏ ఒక్క ప్రధాన పార్టీ కూడా ఇప్పుడు బీజేపీపై బాహాటంగా యుద్ధం ప్రకటించే స్థితిలో లేకపోవడం సరికొత్త రాజకీయ వాస్తవికతను ఆవిష్కరిస్తోంది.ఒకవైపు ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న అన్నాడీఎంకే మళ్లీ అధికారికంగా ఎన్డీయే గూటికి చేరి బీజేపీతో పొత్తును కొనసాగిస్తుండగా.. అధికారం కోల్పోయిన ద్రవిడ మున్నేట్ర కళగం వైఖరిలో వచ్చిన విస్మయకర మార్పు రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. ఓటమి ఎదురైన వెంటనే కాంగ్రెస్‌తో బంధాన్ని తెంచుకుని దూరంగా జరిగిన డీఎంకే.. ఇప్పుడు బీజేపీపై ఒక్క విమర్శ కూడా చేయకుండా పూర్తిగా మౌనముద్ర దాల్చింది. సనాతన ధర్మం, హిందీ వ్యతిరేకత, కేంద్ర నిధుల వివక్ష అంటూ గతంలో రోజూ విరుచుకుపడే ఉదయనిధి స్టాలిన్ వంటి దూకుడు నేతలు సైతం ఇప్పుడు కేంద్రంపై తీవ్రమైన వ్యాఖ్యలు చేయకుండా నోరు కట్టేసుకున్నారు. కేంద్ర దర్యాప్తు సంస్థల భయం, ద్రవిడ ఓటు బ్యాంకులో మార్పులు డీఎంకేను బీజేపీపై సైలెంట్ అయ్యేలా ఒత్తిడి చేశాయన్నది బహిరంగ రహస్యం.మరోవైపు నూతన రాజకీయ శక్తిగా అవతరించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన తలపతి విజయ్ నేతృత్వంలోని టీవీకే తీరు మరింత ఆసక్తికరంగా ఉంది. కాంగ్రెస్, వామపక్షాలు, ఇతర పార్టీల మద్దతుతో సెక్యులర్ సోషల్ జస్టిస్ విక్టరీ అలయన్స్ పేరిట సంకీర్ణ ప్రభుత్వాన్ని నడుపుతున్నప్పటికీ.. విజయ్ జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ కూటమి ప్రాబల్యంలోకి వెళ్లలేదు. ఢిల్లీ వేదికగా ఇండియా కూటమి కేంద్ర ఎన్నికల సంఘంపై సాగిస్తున్న సేవ్ డెమోక్రసీ ఉద్యమానికి గానీ, ఈవీఎంల వ్యతిరేక ప్రచారాలకు గానీ విజయ్ ప్రభుత్వం ఎలాంటి మద్దతు ప్రకటించకపోవడం గమనార్హం. కాంగ్రెస్‌ను తన కూటమిలో ఒక భాగస్వామిగా మాత్రమే ఉంచుకుంటూ.. ఢిల్లీ స్థాయిలో బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో ఎటువంటి ఘర్షణాత్మక వైఖరి లేకుండా సమదూర సంబంధాన్ని కొనసాగిస్తున్నారు.గతంలో తమిళనాడు ఎన్నికల్లో బలంగా పనిచేసిన యాంటీ–బీజేపీ సెంటిమెంట్ ఇప్పుడు తన పదును పూర్తిగా కోల్పోయింది. అన్నాడీఎంకే పొత్తుతో ఉండగా, అధికారం కోల్పోయిన డీఎంకే రాజీ ధోరణిలోకి వెళ్లిపోయింది. అటు కొత్తగా అధికారంలోకి వచ్చిన విజయ్ టీవీకే కేంద్రంతో ఘర్షణ పడే సాహసం చేయడం లేదు. ఈసీ వ్యవహారాలు, కేంద్ర విధానాలపై తమిళనాడు పార్టీలు గళం విప్పకపోవడం.. ద్రవిడ ఉద్యమ పునాదుల్లో సిద్ధాంతాల కంటే అధికార మనుగడ, లబ్ధి మాత్రమే మిగిలాయని నిరూపిస్తోంది. ఒకప్పుడు తీవ్ర ప్రతిఘటనను ఎదుర్కొన్న బీజేపీ.. నేడు తమిళనాట తన వ్యతిరేకతను పూర్తిగా పలుచన చేసి, రాష్ట్ర రాజకీయాలను తన నియంత్రణలోకి తెచ్చుకోవడంలో తెరవెనుక వ్యూహాత్మక విజయం సాధించిందని అనుకోవచ్చు.

# సాధారణంలో అసాధారణం..
# కళాత్మకతలో కొత్త కోణం

ఈ పుస్తకం నిత్యజీవితంలోని వస్తువులు, పరిసరాలు, దైనందిన అనుభవాల్లో దాగివున్న అందాన్ని లోతుగా చర్చిస్తుంది. కళలు, ప్రకృతితో పాటు మనం రోజూ ఎదుర్కొనే సాధారణ జీవితానుభవాలకూ సౌందర్యశాస్త్రంలో తగిన చోటు ఉండాలని థామస్ లెడ్డి వాదిస్తారు. ముఖ్యంగా నిత్యం మనం పలికే 'అమ్ఫ్' (చక్కదనం), 'ఎవంంఎ' (గజిబిజి), 'జూతీవ్ఎ' (ముచ్చటైన రూపం), 'శ్రీశీజవశ్రీఎ' (మనోహరత), 'ఛిబ్వ' (ముద్దులొలికే తీరు), 'జూశ్రీమ్రుయిత్' (ఆహ్లాదం) వంటి మాటలను కూడా సౌందర్య భావనలుగా విశ్లేషించడం ఆయన ఆలోచనల ప్రత్యేకత.

**సౌందర్యం అంటే ఏంది?**

అద్భుతమైన ప్రకృతి దృశ్యాన్ని చూసి పొందే పరవశమా? ఏదైనా అసాధారణ కళారూపం మనపై చూపే బలమైన ప్రభావమా? లేక ఒక గొప్ప చిత్రాన్ని చూసినప్పుడు కలిగే అనుభూతినా? సౌందర్యశాస్త్ర చర్చల్లో చాలాకాలంపాటు ఈ ప్రశ్నలు కళల చుట్టూ, ప్రకృతి వైభవం చుట్టూ, అరుదైన అనుభవాల చుట్టూనే తిరిగాయి. కానీ మనిషి జీవితం ఎప్పుడూ ఇలాంటి గొప్ప క్షణాలతోనే గడవదు. నిత్యం ఎదురయ్యే సాధారణ వస్తువులు, అలవాటైన పనులు, పరిచయమైన పరిసరాలు, చిన్నచిన్న ఎంపికలతోనే మన బతుకు సాగుతుంది. మరి ఈ సాదాసీదా జీవితంలో సౌందర్యం ఉండదా? ఉంటే అది ఎక్కడ, ఏ రూపంలో కనిపిస్తుంది? థామస్ లెడ్డి రాసిన పుస్తకం లేవనెత్తే ముఖ్యమైన ప్రశ్న ఇదే.

ఈ నేపథ్యంలో 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' అనే మాటను సరిగ్గా అర్థం చేసుకోవాలి. ఇది థామస్ లెడ్డి తన సిద్ధాంతానికి పెట్టిన పేరు కాదు. ఆయన సూక్ష్మ సౌందర్యానుభవం అతిసూక్ష్మ సౌందర్యానుభవం సూక్ష్మ సౌందర్య ప్రభావం వంటి మాటలతో చిన్నచిన్న సౌందర్య సందర్భాలను వివరిస్తారు. అలాగే సౌందర్య పూర్వదశ సౌందర్యానుభవ ఆరంభ రూపం వంటి స్థితులనూ చర్చిస్తారు. అందువల్ల 'సూక్ష్మ సౌందర్యశాస్త్రం' అనేది నిత్యజీవిత సౌందర్యంపై ఆయన ఆలోచనలన్నింటినీ కలిపి అర్థం చేసుకోవడానికి వాడే ఒక సులువైన మాట మాత్రమే.

ఇక్కడ 'సూక్ష్మ' అంటే సౌందర్యం విలువ తక్కువని కాదు, అనుభవపు తీవ్రత తక్కువని, పరిధి చిన్నదని, సందర్భం చాలా సాధారణమైనదని అర్థం. రోజూ వేసుకునే బట్టలు ఎంచుకునేటప్పుడు వాటి రంగు, తీరు, పొందిక మనకు నచ్చవచ్చు. అక్కడ పెద్ద పారవశ్యం ఏమీ కలుగకపోవచ్చు, అయినా ఆ బట్టల తీరు మన కండ్లను ఆకట్టుకుంటుంది. వస్తువు ఉపయోగం కంటే దాని రూపురేఖలే మనకు నచ్చిన ఆ క్షణంలోనే ఒక చిన్న సౌందర్యానుభవం మొదలవుతుంది. ఈ అనుభవానికి శ్రద్ధ అవసరం. మన చుట్టూ ఎన్నో వస్తువులు ఉంటాయి. రోజూ చూసే అలవాటు వల్ల, వాటి పనేంటో మనకు తెలుసునన్న ధీమాతో వాటి రూపాన్ని ప్రత్యేకంగా గమనించం. కానీ కాస్త మనసు పెట్టి చూస్తే పరిస్థితి మారిపోతుంది. వాటి రంగు, తీరు, అమరిక, పరిసరాల ప్రత్యేకత స్పష్టంగా కండ్ల ముందు నిలుస్తాయి. ఇక్కడ వస్తువులో ఏ మార్పూ ఉండదు, మారేది మన చూపు మాత్రమే. ఆ మారిన చూపులోనే సౌందర్యం దాగివున్నది.

ఇలాంటి నిత్యజీవిత తాత్విక చూపు దాసరి అమరేంద్ర యాత్రా రచనలైన 'అండమాన్ డైరీ' (2016), 'గల్ఫ్ గీతం' (2021)లలో స్పష్టంగా కనిపిస్తుంది. ఉరుకుల పరుగుల జీవితంలో సూర్యోదయాన్ని, సూర్యాస్తమయాన్ని ఆస్వాదించే తీరిక కరువవుతున్నదని 'అండమాన్ డైరీ'లో రచయిత బాధపడతారు. వెన్నెల కాంతిని చూసి ఆనందించే తీరికా ఉండదు. కండ్ల ముందు ఎన్నో అందమైన దృశ్యాలు కదలిపోతున్నా, ఆగి చూసే శ్రద్ధ, స్పందించే మనసు లోపిస్తున్నాయి. ఈ ఆవేదనలో ప్రకృతిపై ప్రేమే కాకుండా, ఆధునిక మనిషిలో సన్నగిల్లుతున్న పరిశీలనా దృష్టి గురించిన ఆలోచన కూడా కనిపిస్తుంది. రచయిత ఆ శ్రద్ధను తన రచనలో నిలబెట్టుకుంటూ, పెద్ద దృశ్యాలకే కాకుండా చిన్న విషయాలకూ విలువనిస్తారు. రచనలో ఒక పోలీసు.. యువతి తనను స్థానిక ద్వీపవాసిగా పొరబడిన చిన్న సంగతిని ఆయన ఎంతో సరదాగా గుర్తుచేసుకుంటారు. 'అంతకన్నా గొప్ప యోగ్యతా పత్రం చలం గారు కూడా ఇవ్వలేరు!' అనే మాటతో ఆ చిన్న సన్నివేశానికి కొత్త అందం వస్తుంది. ఇక్కడ సౌందర్యం ప్రకృతిలో కాదు, అది మనుషుల మాటల్లో, ఆత్మీయ జ్ఞాపకాల్లో, సున్నిత హాస్యంలో మెరుస్తుంది.

బ్రిటిష్ వృద్ధురాలిని కలిసిన సందర్భంలో ఈ చూపు మరింత విచ్చుకుంటుంది. ఆమె రూపం, మాటలు, రచయిత జవాబు, ఆ తర్వాత సంధ్యావేళ ఆకాశంలో విరిసిన రంగుల సొగసు కలిసి ఒక అందమైన దృశ్యంగా మారతాయి. సూర్యాస్తమయం తర్వాత మిగిలిన రంగులను రచయిత ఒక పాత జ్ఞాపకంతో ముడివేస్తారు. దృశ్యం అక్కడితో ఆగక జ్ఞాపకమై, ఊహతో కలిసి, ఒక సాధారణ క్షణాన్ని గొప్ప అనుభూతిగా మలుస్తుంది.

ఓడ ప్రయాణాన్ని వర్ణించేటప్పుడు కూడా ఇలాంటి చిన్న సౌందర్యమే కనిపిస్తుంది. బయలుదేరాల్సిన సమయం దగ్గరపడినా ఓడ ఇంకా 'నిద్రలేచే లక్షణాలే' చూపలేదని రచయిత రాస్తారు. ఓడ కదలకుండా ఉండటం సాధారణ విషయమే అయినా, దాన్ని ఇంకా మేల్కొనని మనిషిలా ఊహించడంతో ఆ మాటలకు ప్రాణం వస్తుంది. మామూలు సమాచారం ఒక చక్కని రూపకంగా మారి పాఠకుడి మనసులో నిలుస్తుంది. నిత్య జీవిత వాస్తవం సాహిత్యంలో కొత్త సొగసును సంతరించుకుంటుంది. ఇదే దృష్టి 'గల్ఫ్ గీతం'లో మరో తీరుగా దర్శనమిస్తుంది. పుస్తక పరిచయంలోనే ప్రయాణాన్ని కేవలం ఊళ్లు చూడటంగా కాకుండా, కొత్త అనుభవాలను పొందే సాధనంగా భావించాలనే ఆలోచన కనిపిస్తుంది. 'ప్రతి ప్రయాణమూ ఒక పాఠం, ప్రతి మనిషీ ఒక నడిచే పుస్తకం, ప్రతి అనుభవమూ ఆ పుస్తకంలో ఒక అధ్యాయం' అనే మాటలు యాత్రకు మంచి లోతును ఇస్తాయి. ఈ పుస్తకంలో ఆయన నగరాల పైపై మెరుగులనే కాకుండా, దారిపొడవునా కనిపించే చిన్న చిన్న విషయాలను కూడా ఎంతో ఆసక్తితో చూస్తారు. ఎడారి ఒడిలోని నీటి చెలమలు, పచ్చదనం, చెట్ల నీడన సాగే నడక దారులు, అక్కడి ఆహ్లాదం, ఆ నిర్మాణాల చక్కదనం ఆయన రాతల్లో ప్రాణం పోసుకుంటాయి. ఇక్కడ ప్రయాణ వివరాల కంటే, ఆ దృశ్యం రచయిత మనసులో కలిగించిన స్పందనే మనకు నచ్చుతుంది. మనుషులను పరిచయం చేయడంలోనూ ఇదే శ్రద్ధ కనిపిస్తుంది. ప్రయాణంలో కలిసిన వ్యక్తులను రచయిత చూసీచూడనట్లు వదిలేయరు. వారి మాటలను, స్వభావాలను, జీవన నేపథ్యాలను గుర్తుపెట్టుకుని రాస్తూ, ఆ పరిచయాలను విలువైన సాహిత్య జ్ఞాపకాలుగా మలుస్తారు. ఈ తాత్విక దృష్టి కేవలం పుస్తకాల విశ్లేషణకో, సాహిత్య చర్చలకో మాత్రమే పరిమితమైనది కాదు, ఆధునిక ఉరుకులు, పరుగుల జీవితంలో ప్రతి ఒక్కరికీ అవసరమైన జీవన కళ.

# మళ్లీ బ్యాలెట్లతో ఎన్నికలకు ఖర్గే డిమాండ్

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దేశవ్యాప్తంగా జరిగిన లోక్‌సభ , అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు పూర్తిగా అక్రమమని, ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా సహా దేశంలోని ముఖ్యమంత్రులంతా అక్రమ ప్రక్రియ ద్వారానే పదవుల్లోకి వచ్చారని ఆరోపణలు చేశారు. ప్రస్తుత లోక్‌సభతో పాటు అన్ని రాష్ట్రాల అసెంబ్లీలను తక్షణమే రద్దు చేసి, బ్యాలెట్ పేపర్ పద్ధతిలో సరికొత్తగా ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను, రాజ్యాంగబద్ధ ఎన్నికల ప్రక్రియను ఇంత తీవ్రంగా కించపరిచే ప్రకటన దేశంలోని అత్యంత పురాతన జాతీయ పార్టీ అధ్యక్షుడి స్థాయి నుంచి రావడం విడ్డూరంగా మారింది.ఎన్నికల ఫలితాలు అనుకూలంగా వచ్చినప్పుడు ప్రజాస్వామ్యం గెలిచిందని, పరాజయం ఎదురైనప్పుడు వ్యవస్థలన్నీ మేనేజ్ అయిపోయాయని నిందించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందన్న విమర్శలు ఎప్పటినుంచో ఉన్నాయి. అయితే ఈసారి ఖర్గే ఏకంగా దేశంలోని యావత్ ఎన్నికల ప్రక్రియనే చట్టవిరుద్ధం అని ప్రకటించడంతో, పరోక్షంగా భారత రాజ్యాంగం, దేశ ప్రజల తీర్పునే ఆయన అవమానించినట్లయింది. ఈవీఎంల దుర్వినియోగం, ఓటర్ల జాబితాల సవరణ అంటూ సాకులు వెతుకుతూ, క్షేత్రస్థాయిలో వరుస ఓటములకు ఎన్నికల సంఘంపై నెపం నెట్టే ప్రయత్నం కాంగ్రెస్ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకుంటున్నారు. ఖర్గే చెప్పినట్లు దేశంలో జరిగిన ఎన్నికలన్నీ చట్టవిరుద్ధమే అయితే, ఆ వ్యవస్థ ద్వారానే ఏర్పడిన ప్రభుత్వాలు కూడా అక్రమమే కావాలి. మరి అదే నిజమైతే, కాంగ్రెస్ పార్టీ తన వాదనల్లో ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే చేతల్లో చూపించాల్సిన అవసరం ఉంది.కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లోనూ ముఖ్యమంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికైంది ఇదే ఈవీఎంల ద్వారా, ఇదే ఎన్నికల సంఘం పర్యవేక్షణలోనే. మరి ఆ రాష్ట్రాల్లో కాంగ్రెస్ సాధించిన విజయాలు కూడా అక్రమమైనవేనా అన్న ప్రశ్నకు ఆ పార్టీ నేతలు ఏం సమాధానం చెబుతారు? కాంగ్రెస్ పార్టీకి ప్రజాస్వామ్యంపై, దేశ ప్రజల ముందు తమ వైఖరిపై నిజాయితీ ఉంటే.. ఇతరుల రాజీనామాలను డిమాండ్ చేయడానికి ముందుగా తాము పాలించే రాష్ట్రాల్లో నైతిక బాధ్యతను చాటుకోవాలి. కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీలను తక్షణమే రద్దు చేయించి, కాంగ్రెస్ ముఖ్యమంత్రులతో రాజీనామాలు చేయించాలి. మేము ఈ ఎన్నికల ఫలితాలను గుర్తించడం లేదు, అందుకే మా పదవులను త్యజించి బ్యాలెట్ పేపర్ ఎన్నికలను కోరుతున్నాం అని తమ ప్రభుత్వాలను రద్దు చేసినప్పుడే ఖర్గే వాదనలకు దేశంలో కనీస విశ్వసనీయత లభిస్తుంది.అధికారంలో ఉన్న రాష్ట్రాల గద్దెలను అంటిపెట్టుకుని ఉంటూ, కేంద్రంలోని ప్రభుత్వంపై మాత్రం అక్రమం అనే ముద్ర వేసి లోక్‌సభ రద్దును కోరడం పూర్తిగా రాజకీయ ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం. కాంగ్రెస్ గెలిస్తే ప్రజాతీర్పు, ఓడిపోతే వ్యవస్థల కుట్ర అనే కుంటిసాకులు ఇక ఏమాత్రం ప్రజాక్షేత్రంలో చెల్లవు. కాంగ్రెస్ హైకమాండ్ నిజంగానే ప్రస్తుత ఎన్నికల వ్యవస్థను తిరస్కరిస్తే.. ముందుగా తమ సొంత రాష్ట్రాల్లో అధికారాన్ని వదులుకుని రాజీనామాలతో మొదలుపెట్టాలి. అప్పుడు మాత్రమే వారి పోరాటానికి నైతిక బలం చేకూరుతుంది.

# శ్మశాన వాటిక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని పరమేశ్వర్ రెడ్డిని కలిసిన ఉప్పల్ వైశ్య బ్రాహ్మణ సంఘాల ప్రతినిధులు

**ఉప్పల్, అక్టోబర్ 5 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గంలోని బీరప్పగడ్డ డివిజన్‌లో ఉన్న వైశ్య, బ్రాహ్మణుల శ్మశాన వాటికను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి తెలిపారు.

సోమవారం ఉప్పల్‌కు చెందిన వైశ్య, బ్రాహ్మణ సంఘాల నాయకులు మందుముల పరమేశ్వర్ రెడ్డిని కలిసి, బీరప్పగడ్డ డివిజన్‌లో ఉన్న శ్మశాన వాటిక అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, శ్మశాన వాటిక అభివృద్ధి అంశాన్ని మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు చేయించేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. వైశ్య, బ్రాహ్మణ సమాజాలకు అవసరమైన మౌలిక వసతులు



కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తానని పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిక్కుమల అంజయ్య గుప్తా, బిక్కుమల అశోక్ గుప్తా, బిక్కుమల రమేష్ గుప్తా, మోత్కూరి అరవింద్ శర్మ, బిక్కుమల సుధాకర్ గుప్తా, పాలడుగు సంతోష్ గుప్తా, సముద్రాల



నవీన్ గుప్తా, రేణిగుంట కిరణ్ గుప్తా, మా శెట్టి రాఘవేంద్ర గుప్తా, బిక్కుమల సంతోష్ గుప్తా, శ్రీధర్ గుప్తా, దాల్చా రాకేష్ గుప్తా, బిక్కుమల రాకేష్ గుప్తా, బిక్కుమల హరీష్ గుప్తా, ఉప శంకర్ గుప్తా, బిక్కుమల జగదీష్ గుప్తా, బిక్కుమల రవి గుప్తా, గౌరీశెట్టి శ్రీనివాస గుప్తా, రాజు గుప్తా, శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# చెరువులు ఎండిపోవడంతో చిలుకా నగర్ లో తీవ్ర మంచినీటి కొరత

**- 1000 అడుగుల లోతుకు బోర్లు వేసినా నీరు పడని దుస్థితి.. అధికారులకు నాయకుల వినతిపత్రాలు**

**చిలుకానగర్, అక్టోబర్ 5 ( మన మీ వార్త):**

చిలకనగర్ డివిజన్‌లోని చిలకనగర్, మల్లికార్జున్ నగర్ కాలనీ, న్యూ రామ్‌నగర్ కాలనీ, కుమ్మరికుంట, ఆదర్శనగర్, ఆనంద్‌నగర్ కాలనీ, గణేష్‌నగర్, బీరప్పగడ్డ తదితర ప్రాంతాల్లో మంచినీటి కొరత తీవ్రంగా మారింది. చెరువులు పూర్తిగా ఎండిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటిపోయి బోర్లలో నీరు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 1000 అడుగుల లోతు వరకు బోర్లు వేసినా నీరు పడని పరిస్థితి నెలకొందని తెలిపారు. మంచినీటి సరఫరా కూడా మూడు, నాలుగు రోజులకు ఒకసారి మాత్రమే జరుగుతుండటంతో ప్రజల అవసరాలకు నీరు సరిపోవడం లేదని పేర్కొన్నారు. ఎండాకాలం ప్రారంభం



కాకముందే పరిస్థితి ఇంత తీవ్రంగా ఉంటే వేసవి కాలంలో నీటి సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని కాలనీ ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు సోమవారం ఉప్పల్ మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ సంతోష్ కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అదేవిధంగా ఉప్పల్ జోనల్ కమిషనర్, ఉప్పల్ కమిషనర్ ఆనంద్



కుమార్ లను కలిసి మంచినీటి సమస్యను వివరించి మరో వినతిపత్రం సమర్పించారు. ఆయా ప్రాంతాలకు క్రమం తప్పకుండా మంచినీటి సరఫరా చేయడంతో పాటు ప్రత్యామ్నాయంగా నీటి వసతి కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి రవీందర్ ముదిరాజ్, విట్టల్ ముదిరాజ్, మాస శేఖర్, నిమ్మగంటి యాదగిరి, దూదేకుల సిద్దయ్య, గుర్రాల స్వామి ముదిరాజ్, సత్యనారాయణ ముదిరాజ్, శివకుమార్ ముదిరాజ్, పిట్టల నరేష్ నేత, లెనిన్, శ్రీనివాస్‌తో పాటు ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

# ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఉప్పల్ యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం

**- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి సమష్టిగా కృషి చేయాలి**

**- యువజన కాంగ్రెస్ బలోపేతానికి భవిష్యత్ కార్యాచరణపై దిశానిర్దేశం**

**ఉప్పల్, అక్టోబర్ 5 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ ఆధ్వర్యంలో ఉప్పల్ యువజన కాంగ్రెస్ విస్తృత స్థాయి ఎగ్జిక్యూటివ్ కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆకారపు అరుణ్ పటేల్ మాట్లాడుతూ, గత పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి రేవంత్ రెడ్డిని గెలిపించేందుకు కాంగ్రెస్ శ్రేణులు ఏకతాటిపై నిలిచి పనిచేసిన విధంగానే, రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి విజయానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని అన్నారు. నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో యువజన కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేసి, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.

యువతను కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో అనుసంధానం చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సమావేశంలో చర్చించారు. రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, యువతను పెద్ద సంఖ్యలో పార్టీ వైపు ఆకర్షించడం, డివిజన్ స్థాయిలో యువజన కాంగ్రెస్ కార్యకలాపాలను విస్తరించడం వంటి అంశాలపై నాయకులు చర్చించారు. ఈ సమావేశానికి






ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జ్, ఆల్ ఇండియా యూత్ కాంగ్రెస్ నేషనల్ సెక్రటరీ భవ్య, బొమ్మకి అజయ్, నాగార్జున, మునీర్ తదితరులు హాజరయ్యారు. వారు యువజన కాంగ్రెస్ సంస్థాగత బలోపేతం, పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లే విధానం, రానున్న ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, భవిష్యత్ కార్యాచరణపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. యువజన కాంగ్రెస్ నాయకులు ఐక్యంగా పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌లో యువజన కాంగ్రెస్ కార్యకలాపాలను చురుగ్గా నిర్వహిస్తూ, ప్రజా



సమస్యలపై నిరంతరం స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు నిఖిల్, సాయి, సచిన్, కిషోర్, నియోజకవర్గంలోని వివిధ డివిజన్ల అధ్యక్షులు జయంత్, ప్రశాంత్, భాను, ఉప్పల్ ప్రశాంత్, వాసు తదితరులతో పాటు యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంజూరైన కమ్యూనిటీ హాల్ పనులను వెంటనే ప్రారంభించాలి

**- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్**

**బీరప్పగడ్డ, అక్టోబర్ 5 ( మన మీ వార్త):**

బీరప్పగడ్డ డివిజన్‌లో సాంక్షన్ అయిన శ్రీనగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీ కమ్యూనిటీ హాళ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కోరారు.

శ్రీనగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీల్లో నిర్మించనున్న కమ్యూనిటీ హాళ్లను ఎస్సీ రమేష్ బాబుతో కలిసి బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ప్రత్యక్షంగా పరిశీలించారు. కమ్యూనిటీ హాళ్లకు నిధులు మంజూరై ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించలేదని ఆయన తెలిపారు. వెంటనే కాంట్రాక్టర్లతో పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎస్సీ




రమేష్ బాబును కోరారు.
దీనిపై స్పందించిన ఎస్సీ రమేష్ బాబు అక్కడి నుంచే కాంట్రాక్టర్లకు ఫోన్ చేసి, పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా నిర్మాణ పనులను పూర్తి చేసి కాలనీ ప్రజలకు కమ్యూనిటీ హాళ్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో డీఈ వెన్నెల గౌడ్, ఏఈ రాజ్ కుమార్, శ్రీనగర్ కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీ



వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఓంప్రకాష్, అంజన్న, ప్రభాకర్ రెడ్డి, రవి వర్మ, యాకేష్, గిరి తదితరులు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# రామంతపూర్ దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షులుగా వల్లపు జగన్ యాదవ్ ఎన్నిక

**రామంతాపూర్, అక్టోబర్ 5 ( మన మీ వార్త):**



రామంతాపూర్ మెయిన్ రోడ్డుపై దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఘనంగా రావణ సంహార మేళాను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

గత 33 సంవత్సరాలుగా రామంతాపూర్‌లో రావణ సంహార మేళాను సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 4న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవ కమిటీని ఏకగ్రీవంగా ఏర్పాటు చేశారు.

కమిటీ చైర్మన్‌గా బుర్ర రాజేశ్వర్, వైస్ చైర్మన్‌గా కె. ముత్తినేని జగదీష్, అధ్యక్షుడిగా వల్లపు జగన్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా తాళ్ల బాలకృష్ణ, కోశాధికారిగా ఇటికల వెంకటేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఈ కార్యక్రమంలో కక్కిరేణి హరీష్, శ్రీనివాస చారి, తిండేరు హనుమంత్ రావు, బొడ్డుపల్లి నిహాన్, బండారు వెంకటరావు, కొంపల్లి ఉపేందర్, సంజయ్ పటేల్, రవీందర్ రెడ్డి, రేవు నరసింహ, నందకిషోర్ యాదవ్, బోడుప్పల్లి ముత్యం, రామంతాపూర్ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సంతోష్ గుప్త లు పాల్గొన్నారు.

# శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించిన పరమేశ్వర్ రెడ్డి

**- ఉప్పల్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ ఆలయంలో 11 నుంచి ప్రత్యేక పూజలు**



**ఉప్పల్, అక్టోబర్ 5 ( మన మీ వార్త):**

ఉప్పల్ సౌత్ స్వరూప్ నగర్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి పంచాయతన దేవాలయం శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు సంబంధించిన కరపత్రాన్ని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈనెల 11 నుంచి 20 వరకు ఆలయంలో శ్రీ దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు జరుగుతాయి. ఈ సందర్భంగా ఆలయ కమిటీ, ఉప్పల్ ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులతో కలిసి పరమేశ్వర్ రెడ్డి కర పత్రాన్ని ఆవిష్కరించారు. ఆలయంలో జరిగే ప్రత్యేక పూజా కార్యక్రమాలకు రావాల్సిందిగా ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డిని కమిటీల ప్రతినిధులు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిక్కుమల అంజయ్య గుప్తా , బిక్కుమల అశోక్ గుప్తా , బిక్కుమల రమేష్ గుప్తా , మోత్కూరి అరవింద్ శర్మ , బిక్కుమల సుధాకర్ గుప్తా , పాలడుగు సంతోష్ గుప్తా , సముద్రాల నవీన్ గుప్తా , రేణిగుంట కిరణ్ గుప్తా , మా శెట్టి రాఘవేంద్ర గుప్తా ,బిక్కుమల సంతోష్ గుప్తా, శ్రీధర్ గుప్తా,దాల్చా రాకేష్ గుప్తా, బిక్కుమల రాకేష్ గుప్తా, బిక్కుమల హరీష్ గుప్తా, ఉప శంకర్ గుప్తా,బిక్కుమల జగదీష్ గుప్తా, బిక్కుమల రవి గుప్తా, గౌరీశెట్టి శ్రీనివాస గుప్తా,రాజు గుప్తా, శ్రీనివాస్ గుప్తా, మరియు ఇతరులు పాల్గొన్నారు.

# టైగర్ జోన్ పేరుతో ఇళ్ల నిర్మాణం ఆపొద్దు..

**- కొలాంగూడ గిరిజనుల 31 ఇళ్ల నిర్మాణాలు కొనసాగించాలి..**

**- నిర్మాణం ప్రారంభించిన ఇళ్లకు వెంటనే బిల్లులు చెల్లించాలి..**

**- ఫారెస్టు అధికారుల వేధింపులు ఆపాలని,**

**- సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఆర్ డి వో కు వినతి..**

**నిర్మల్ జిల్లా, అక్టోబర్ 5(మన మీ వార్త) :**




కడెం మండలం ఇస్లాంపూర్ గ్రామ పరిధిలోని కొలాంగూడ గిరిజనులకు మంజూరైన 31 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను టైగర్ జోన్ పేరుతో అడ్డుకోవద్దని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఉమ్మడి జిల్లా కార్యదర్శి నందిరామయ్య కోరారు.

ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోటీ ఎన్ జి వో ఎస్ ఆఫీస్ నుండి మున్సిపల్ కార్యాలయం మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి. ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవో దేవదాస్ కు వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా నంది రామయ్య మాట్లాడుతూ..
కొలాంగూడకు చెందిన 31 మంది గిరిజనులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఇళ్లు మంజూరయ్యాయని, సొంతింటి కల నెరవేరుతుందనే ఆశతో తమ నివాస గుడిసెలను తొలగించుకుని నిర్మాణ పనులు ప్రారంభించారని తెలిపారు. కొందరు పునాదులు తవ్వగా, మరికొందరు సిమెంటు బీములు వేసుకున్న సమయంలో టైగర్ జోన్‌లో ఉందంటూ ఫారెస్టు అధికారులు నిర్మాణాలను అడ్డుకున్నారని పేర్కొన్నారు. దీంతో దాదాపు ఏడాదిగా ఎండకు ఎండుతూ, వానకు నానుతూ ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే సమస్యను కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామని, కలెక్టర్ గ్రామాన్ని సందర్శించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదని నందిరామయ్య పేర్కొన్నారు. వెంటనే తగిన ఆదేశాలు జారీ చేసి ఇళ్ల నిర్మాణాలను కొనసాగించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్మాణం ప్రారంభించిన 31 ఇళ్లకు బిల్లులు చెల్లించాలని కోరారు. ఫారెస్టు అధికారుల వేధింపులను ఆపాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలోఏ ఐ యూ కే ఎస్ జిల్లా నాయకులు సిడాం సోనేరావ్, గ్రామ నాయకులు సిడాం భీమ్‌రావ్, ఆత్రం రాము తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయ నిర్మాణానికి భారీ విరాళం

**పటాన్ చేరు అక్టోబర్ 05మీ వార్త ప్రతినిధి :**



రూ.2,00,016 విరాళం అందించిన బీరంగూడ నివాసితులు ఎరుకల ప్రభాకర్ కుటుంబం..

బీరంగూడ గుట్టపై నిర్మిస్తున్న శ్రీ అయ్యప్ప స్వామి నూతన ఆలయ నిర్మాణానికి తమ వంతు



సహాయంగా బీరంగూడ నివాసితులు ఎరుకల ప్రభాకర్ కుటుంబం రూ.2,00,016 విరాళాన్ని ఆలయ నిర్మాణానికి సమర్పించింది. ఈ విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులు కొల్లూరు మల్లేష్, రాజ మల్లేష్, ఆధ్వర్యంలో ఆలయ కమిటీ వారికి అందజేశారు. ఆలయ నిర్మాణానికి ఉదారంగా విరాళం అందించిన ఎరుకల ప్రభాకర్ కుటుంబాన్ని కమిటీ సభ్యులు అభినందించారు. శ్రీ అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎరుకల ప్రభాకర్ కుటుంబంపై ఎల్లవేళలా ఉండాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణానికి భక్తులు, దాతలు తమ వంతు సహకారం అందించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

## విద్యుత్ కోతలతో ఎండిపోతున్న వరి పంటలు

**విద్యుత్ కోత సమస్య పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం ఎమ్మెల్యే సునీతారెడ్డి**

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (5):**



వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్‌లో కోతలు విధించడంతో వరి పొలాలకు సకాలంలో నీరందక పంటలు ఎండిపోతున్నాయని ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. విద్యుత్ సమస్యను వెంటనే పరిష్కరించకుంటే రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

మండల పరిధిలోని గంగయ్యపల్లి నుంచి చెంది వరకు రూ.2.35 కోట్ల నిధులతో సుమారు 2.5 కిలోమీటర్ల మేర నిర్మించనున్న బీటీ రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే సునీతారెడ్డి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం గ్రామంలో విద్యుత్ కోతల కారణంగా నీరందక ఎండిపోతున్న పెద్దదాసరి రవి,అర్జున్‌కు చెందిన వరి పంట పొలాలను ఆమె పరిశీలించారు.

ఈ సందర్భంగా రైతులతో మాట్లాడి పంటలకు ఎదురవుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కోతల కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి,సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతులకు సాగునీరు అందేలా విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సాయిలు,ఉపసర్పంచ్ పవన్ కుమార్ గుప్తా, సీనియర్ నాయకులు గోర్రెవెంకటరెడ్డి,సర్పంచులు నారాయణరావు,నరేష్, నాయకులు శేఖర్ గౌడ్, మహేందర్ రెడ్డి,రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## జవహర్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్తత: "కష్టపడి కొనుక్కున్నాం.. కూల్చవద్దు" అంటూ బండి నవీన్ కుటుంబం రోదన




**జవహర్‌నగర్ , అక్టోబర్ 5 ( వార్త ప్రతినిధి) :**

అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంతమంది వ్యక్తులు చేస్తున్న కుట్రల వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, కష్టపడి కొనుక్కున్న స్థలంలో నిర్మించుకున్న డబ్బా (షాపు)ను కూల్చివేయవద్దంటూ బాధితుడు బండి నవీన్ ఆయన తల్లి కంటతడి పెట్టారు. ఈ ఘటనతో స్థానిక జవహర్‌నగర్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

**సంఘటన వివరాలు:**

స్థానికంగా ఉన్న బండి నవీన్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాము ఎంతో కష్టపడి సంపాదించుకున్న డబ్బులతో సదరు స్థలాన్ని కొనుగోలు చేశామని, ఎలాంటి ఆక్రమణకు లేదా కబ్జాకు పాల్పడలేదని స్పష్టం చేశారు. అయితే, కొంతమంది వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనాల కోసం, అక్రమార్జన దృష్టిలో ఉంచుకొని అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు.

రాజకీయ, అధికార ప్రాబల్యాన్ని ఉపయోగించి, రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెచ్చి తాము నివసిస్తున్న/వ్యాపారం చేసుకుంటున్న డబ్బాను కూల్చివేసేందుకు కుట్ర పన్నుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

**కంటతడి పెట్టిన కుటుంబం:**

అధికారులు కూల్చివేతలకు సిద్ధపడటంతో నవీన్ ఆయన తల్లి అధికారుల కాళ్లవేళ్లా పడి వేడుకున్నారు. "మేం ఏ కబ్జా చేయలేదు.. రూపాయి రూపాయి కూడబెట్టి కష్టపడి ఈ స్థలాన్ని కొనుక్కున్నాం. మా పొట్ట కొట్టవద్దు, ఈ డబ్బాను కూల్చివేయవద్దు" అంటూ బాధితులు రోదించిన తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

బాధితులకు మద్దతుగా స్థానికులు కూడా తరలిరావడంతో అక్కడ వాతావరణం వేడెక్కింది. ఎలాంటి అన్యాయమైన చర్యలు చేపట్టినా ఊరుకునేది లేదని, సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని నవీన్ కుటుంబం అధికారులను, ప్రభుత్వాన్ని వేడుకున్నారు.

# రూ.23.35 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**- పుష్కరాల పనులు, రిజిస్ట్రార్, తహసీల్దార్ కార్యాలయాలు, ఆరోగ్య ఉపకేంద్రాలకు శ్రీకారం**

**- రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు**

**నిర్మల్ జిల్లా, అక్టోబర్ 5(మన మీ వార్త) :**

జిల్లాలో వివిధ అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రులు సోమవారం శంకుస్థాపనలు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాతో కలిసి దాదాపు రూ.23.35 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు.

వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించిన రహదారుల నిర్మాణ పనులతో పాటు రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాలు, ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రాలకు సంబంధించిన నిర్మాణ పనులకు మంత్రులు శ్రీకారం చుట్టారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు, ప్రభుత్వ సేవలు అందించేందుకు చేపడుతున్న ఈ పనులను



నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులు చర్యలు చేపట్టనున్నారు.

జిల్లా పర్యటనకు సోమవారం ఉదయం నిర్మల్ చేరుకున్న రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల ఉన్నతాధికారులు డి.ఎస్. లోకేష్‌కుమార్, రాజీవ్‌గాంధీ హనుమంతు, వి.పి. గౌతమ్‌లకు జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, అధికారులు ఘన స్వాగతం పలికారు.

మంత్రులు, ఉన్నతాధికారులకు కలెక్టర్ భవేశ్ మిశ్రా పూల మొక్కలను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీసులు గౌరవ వందనం సమర్పించారు. అక్కడి నుంచి మంత్రులు, ఉన్నతాధికారులు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీం



ఆసిఫాబాద్ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, రాజర్షి షా, హరిత,

నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల, ఆసిఫాబాద్ అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, ఆర్ ఎస్ చిత్రు, చంద్రయ్య, రాములు, డేవిడ్, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముదోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఉట్నూర్ ఐ టి డి ఎ పి ఓ మంద మకరందు, సబ్ కలెక్టర్లు, డిప్యూటీ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ, గృహ నిర్మాణ అంశాలపై మంత్రుల సమీక్ష







**- భూ సమస్యల పరిష్కారం.. ఇళ్ల నిర్మాణం వేగవంతంపై సమీక్ష**

**నిర్మల్ జిల్లా, అక్టోబర్ 5(మన మీ వార్త):**

జిల్లాలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖలకు సంబంధించిన వివిధ అంశాలపై రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఎక్సైజ్, సాంస్కృతిక శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సోమవారం నిర్మల్ కలెక్టరేట్‌లో సుదీర్ఘంగా సమీక్ష నిర్వహించారు. ఆయా శాఖల పరిధిలో కొనసాగుతున్న కార్యక్రమాలు, సమస్యలు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రులు అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి భూ సమస్యలు, భూ పరిపాలన, రికార్డుల నిర్వహణ, భూ సంబంధిత దరఖాస్తుల పరిష్కారం, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు తదితర అంశాలపై సమీక్షించారు. ప్రజలకు రెవెన్యూ సేవలు సులభంగా, పారదర్శకంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.

గృహ నిర్మాణ శాఖకు సంబంధించి ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను వేగవంతం చేయడం తదితర అంశాలపై మంత్రులు సమీక్షించారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిర్మాణాలు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల పరిధిలో రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖల పనితీరుపై మంత్రులు సమీక్షించారు. జిల్లాల వారీగా చేపడుతున్న కార్యక్రమాలు, పురోగతిని కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను ప్రాధాన్య క్రమంలో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని అధికారులకు సూచించారు.

ఈ సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా, కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఐటీడీఏ పీవో మంద మకరందు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల అదనపు కలెక్టర్లు, సబ్ కలెక్టర్లు, రెవెన్యూ, గృహ నిర్మాణ, అటవీ శాఖల అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రామంతాపూర్‌లో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

**- డీజీపీ సీవీ ఆనంద్‌ను కోరిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**రామంతపూర్, అక్టోబర్ 5 ( మన మీ వార్త):**

ఉప్పల్ నియోజకవర్గంలో పెరుగుతున్న జనాభా, విస్తరిస్తున్న పట్టణ ప్రాంతాల నేపథ్యంలో ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు రామంతాపూర్‌లో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్‌ను ఎమ్మెల్యే మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని శాంతిభద్రతలు, పోలీస్ వ్యవస్థ బలోపేతానికి సంబంధించిన పలు అంశాలను డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. నియోజకవర్గంలో సుమారు మూడు లక్షలకు పైగా జనాభా ఉండటంతో ప్రస్తుతం ఉన్న పోలీస్ వ్యవస్థపై అదనపు భారం పడుతోందని వివరించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రామంతాపూర్‌లో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడంతో పాటు, అవసరమైన సంఖ్యలో పోలీస్ అధికారులు, సిబ్బందిని కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక పోలీస్ స్టేషన్‌కు శాశ్వత భవనం నిర్మించే వరకు ప్రస్తుతం ఉన్న రామంతాపూర్ వార్డు కార్యాలయంలో తాత్కాలికంగా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనివల్ల స్థానిక ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ కావడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో పోలీసులు వేగంగా స్పందించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.



ఇదే సందర్భంగా ఉస్మానియా యూనివర్సిటీ పరిధి నుంచి పోలీస్ స్టేషన్‌ను విభజించి ఉప్పల్ పరిధిలోకి తీసుకురావడానికి సహకరించినందుకు డీజీపీకి ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉప్పల్ ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వం, పోలీస్ శాఖ చేపడుతున్న చర్యలను అభినందించారు.

నియోజకవర్గంలో కొత్త కాలనీల విస్తరణ, జనాభా పెరుగుదల, పారిశ్రామిక ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రామంతాపూర్‌లో ప్రత్యేక పోలీస్ స్టేషన్ ఏర్పాటు, తగిన సిబ్బంది కేటాయింపు అంశాలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని డీజీపీని కోరారు.

ఎమ్మెల్యే ప్రస్తావించిన అంశాలను పరిశీలించి, అవసరమైన చర్యలు తీసుకునే దిశగా సంబంధిత అధికారులతో చర్చిస్తామని డీజీపీ సీవీ ఆనంద్ ఈ సందర్భంగా తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గంధం నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ప్రారంభమైన బొడ్డమ్మ ఉత్సవాలు

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (5):**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే బతుకమ్మ సంబరాల్లో భాగంగా బాలికలు నిర్వహించే బొడ్డమ్మ ఉత్సవాలు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆవుపేడతో తయారు చేసిన బొడ్డమ్మలను పూలతో అందంగా అలంకరించి మహిళలు, బాలికలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బొడ్డమ్మల చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ,ఆటలాడుతూ ఉత్సాహంగా వేడుకలు నిర్వహించారు.

సాయంత్రం వేళ గ్రామాల్లోని వీధుల్లో బాలికలు, మహిళలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణం నెలకొంది. బొడ్డమ్మ ఉత్సవాలతో గ్రామాల్లో బతుకమ్మ సంబరాల సందడి మొదలైంది. చిన్నారులు ఉత్సాహంగా పాల్గొనడంతో గ్రామాల్లో సందడి నెలకొంది. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే ఈ ఉత్సవాలను ప్రతి ఏడాది ఆనందోత్సాహాలతో నిర్వహిస్తామని గ్రామస్థులు తెలిపారు.



printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## హనుమకొండ ప్రజావాణి వినతుల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :



హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన జిల్లా కలెక్టర్ కలెక్టరేట్ తో పాటు ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి



కార్యక్రమానికి వచ్చిన అర్జీలు 254

ప్రజావాణి కార్యక్రమం ద్వారా నమోదవుతున్న వినతుల పరిష్కారానికి వేగవంతంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.

సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలపై అందించిన వినతులను జిల్లా కలెక్టర్ స్వీకరించారు. వచ్చిన అర్జీల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని, అదేవిధంగా జిల్లా కలెక్టరేట్ కు వచ్చిన అర్జీలను పరిష్కరించే చర్యలు చేపట్టాలని ఆర్డీవోలు, తహసిల్దార్లను కలెక్టర్ వర్చువల్ విధానం ద్వారా ఆదేశించారు.

ప్రజావాణి అర్జీలలో వివిధ శాఖల వారీగా ఉన్న పెండింగ్ లో ఉన్నవాటిపై సమీక్ష చేసి త్వరగా పరిష్కారానికి చర్యలు చేపట్టడంపై అధికారులకు కలెక్టర్ ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో అందిన వినతుల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయొద్దని పేర్కొన్నారు.

పెండింగ్ లో ఉన్న వినతుల పరిష్కారానికి వెంటనే పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు.

ప్రతి జిల్లా కార్యాలయంలో ప్రత్యేకంగా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కార బాధ్యతలు ఒకరికి అప్పగించాలన్నారు

ఆయా అప్లికేషన్లపై చర్యలు తీసుకున్న నివేదిక సమర్పించి అధికారులు వాటిని పరిష్కరించాలన్నారు.

ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

కాగా ఆర్డీవో కార్యాలయాల్లో ఆర్డీవోలు ఇతర అధికారులు పాల్గొని ప్రజల నుండి అర్జీలను, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.

జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం తో పాటు హనుమకొండ, పరకాల ఆర్డీవో కార్యాలయాలు, ఎంపీడీవో కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 254 వినతులు అందాయి.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్.రవి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్, డిఆర్డిఓ మేన శ్రీను, ఇతర శాఖల జిల్లా అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

## కమ్మ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు చిత్రపటానికి నివాళులు అర్పించిన కమ్మ సంఘాల సమాఖ్య రాష్ట్ర నాయకులు

ఖానాపురం, అక్టోబర్ 5 (మీ వార్త ప్రతినిధి) :



వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండల కాకతీయ కమ్మ సంఘం అధ్యక్షులు కొరిటాల వెంకటేశ్వరరావు కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో అకాల మృతి చెందారు. కాగా సోమవారం ఖానాపురంలో బాధిత కుటుంబ సభ్యులను తెలంగాణ రాష్ట్ర కమ్మ సంఘాల సమాఖ్య కమిటీ కార్యదర్శి గంగవరపు రామకృష్ణ ప్రసాద్, కమిటీ ఈసీ మెంబర్ వడ్డే చిరంజీవి పరామర్శించారు. అనంతరం వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో వరంగల్ జిల్లా కమ్మ సంఘం మాజీ అధ్యక్షులు మందడపు కోటేశ్వరరావు, కమ్మ సంఘం జిల్లా సెక్రటరీ వెంకటకృష్ణ, కొల్లి అనిల్, నర్సంపేట కమ్మ సంఘం ఉపాధ్యక్షులు బండారుపల్లి చెంచారావు, చెరుకూరి ప్రసాద్, కోశాధికారి పాలడుగు వెంకటేశ్వరరావు, ఖానాపురం కాకతీయ కమ్మ సంఘం మాజీ అధ్యక్షులు దేవినేని వెంకటప్రసాద్, కొమ్మినేని మోహన్ రావు, మండవ శివ ప్రసాదరావు, దేవినేని వేణు కృష్ణ, ప్రస్తుత కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యక్షులు వల్లభనేని కిరణ్, ప్రధాన కార్యదర్శి పరిటాల రామారావు, సహాయ కార్యదర్శి గోగినేని శ్రీను, కోశాధికారి వేములపల్లి రామ్మోహన్ రావు, కమ్మ కుల బాంధవులు పాల్గొన్నారు.

## ఘనంగా గడ్డం కాకా వెంకటస్వామి జయంతి

కాసిపేట, అక్టోబరు 5 (మన మీ వార్త మండల ప్రతినిధి) :



మాజీ పార్లమెంటు సభ్యుడు, దివంగత గడ్డం కాకా వెంకటస్వామి జయంతి వేడుకలను సోమవారం కాసిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి షేక్ సఫ్దర్ అలీ, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణతో పాటు వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సాయిజెన్ శేఖర్‌పై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు ఫిర్యాదు చేసిన బీజేపీ డివిజన్ నాయకులు

నాచారం, అక్టోబర్ 5 (మన మీ వార్త):

ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ నాయకుడు చిట్టిపోలు శేఖర్ అలియాస్ సాయిజెన్ శేఖర్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక బీజేపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సాయిజెన్ శేఖర్‌పై రౌడీషీట్ తెరిచి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.

నాచారం భవానీనగర్‌లో ఇటీవల జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో సాయిజెన్ శేఖర్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని బీజేపీ నాయకులు ఆరోపించారు. స్థానిక ప్రజల ఆహ్వానం మేరకు అక్కడికి వచ్చిన ప్రభాకర్‌కు ప్రజలు తమ సమస్యలను వివరించారని, ఆయన వారి సమస్యలను తెలుసుకుని జరుగుతున్న పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారని తెలిపారు.

ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వచ్చిన నాయకుడిపై అభ్యంతరకరంగా మాట్లాడటంతో పాటు





స్థానికులను బెదిరించే ధోరణిలో వ్యాఖ్యలు చేశారని వారు ఆరోపించారు. సాయిజెన్ శేఖర్ గతంలో పలువురిని బెదిరిస్తూ, దాడులకు పాల్పడుతూ స్థానికంగా వివాదాలకు కారణమవుతున్నారని పేర్కొంటూ, సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు.

అదేవిధంగా గతంలో ఆయన భార్య కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో డివిజన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్లు, భవనాల యజమానులు, కంపెనీలు, కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి అక్రమంగా ఆర్థిక ప్రయోజనాలు పొందారనే ఆరోపణలపై కూడా విచారణ జరిపించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై అధికార పార్టీ నాయకులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి విచారణ జరిపించాలని స్థానిక కాంగ్రెస్ నాయకులను కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మల్లెల నర్సింగ్‌రావు, పోతగాని గోపాల్‌గౌడ్, డివిజన్ అధ్యక్షులు నవీన్, ప్రకాశ్, రాగిరి మోహన్‌రెడ్డి, అభిషేక్‌గౌడ్, ఉదయ్, పాదం వెంకటేశ్, వెంకట్ నాయక్, శ్రీమూర్తి నాగరాజు, చిల్లా అశోక్, నవీన్‌గౌడ్, రాజిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నవీన్‌రెడ్డి, వేణుగోపాల్, శేఖర్, క్రాంతికుమార్, వెంకటేశ్, నవీన్ చింటూ, కిషోర్, అనితారెడ్డి, మంజుల, వరలక్ష్మి, కళావతి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులపై తక్షణ చర్యలు తీసుకోవాలి: బల్దియా కమిషనర్ టి. వెంకన్న

- ప్రజావాణిలో 81 దరఖాస్తుల స్వీకరణ..
- గత వారం ఫిర్యాదుల పరిష్కార పురోగతిపై సమీక్షలి
- ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్, బతుకమ్మ--దసరా ఏర్పాట్లపై అధికారులకు కీలక ఆదేశాలు

మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి:

**GWMC, అక్టోబర్ 05:** ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటికి సత్వర పరిష్కారం అందించడమే ప్రజావాణి కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అన్నారు.

సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ ప్రజల నుంచి 81 దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి వినతిని క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావాన్ని బట్టి సంబంధిత విభాగాలకు అప్పగించి, నిర్ణీత సమయంలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదును అత్యంత ప్రాధాన్యతతో పరిగణించాలని, సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యానికీ తావివ్వరాదని కమిషనర్ స్పష్టం చేశారు. ప్రజలకు అందించే ప్రతి సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండాలని సూచించారు.

పెండింగ్ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి

గత వారం ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కార పురోగతిని కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను



తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలు, పరిష్కార వివరాలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు.

ప్రజల సమస్యలను కేవలం దరఖాస్తులుగా కాకుండా, పౌరుల సమస్యలకు పరిష్కారం అందించాల్సిన బాధ్యతగా అధికారులు భావించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం లేదా అనవసర జాప్యం చోటుచేసుకుంటే సంబంధిత అధికారులు బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ స్పష్టం చేశారు.

విభాగాల వారీగా స్వీకరించిన దరఖాస్తులు

- టౌన్ ప్లానింగ్: 32
- ఇంజినీరింగ్: 28
- ఆరోగ్యం, పారిశుద్ధ్యం: 09
- రెవెన్యూ: 09
- నీటి సరఫరా: 03
- మొత్తం: 81 దరఖాస్తులు

**బతుకమ్మ--దసరా పండుగలకు సమన్వయంతో ఏర్పాట్లు**

ప్రజావాణి అనంతరం అధికారులతో కమిషనర్ మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా గతంలో మాదిరిగా సమగ్ర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. పండుగల నేపథ్యంలో ప్రజల రద్దీ, ప్రధాన కార్యక్రమాలు జరిగే ప్రాంతాలను దృష్టిలో ఉంచుకుని పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారుల మరమ్మతులు, వెలుగుల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలను ముందస్తుగా సిద్ధం చేయాలని సూచించారు.

అన్ని విభాగాల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, పండుగల సమయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజలు పండుగలను ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకునేలా బల్దియా తరఫున అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.

ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ వేగవంతం చేయాలి

ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వెరిఫికేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులు, సిబ్బందిని కమిషనర్ ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను సమన్వయంతో చేపట్టి, పెండింగ్ లేకుండా నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం ప్రయోజనాలు సకాలంలో అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని కమిషనర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, డీఎఫ్ఓ శంకర్‌లింగం, సీహెచ్ఓ లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, సమ్మయ్య, సెక్రటరీ అనిల్‌బాబులతో పాటు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజావాణిలో పెట్రోల్ పోసుకున్న ఘటనపై పిటిషనర్ వాగ్మూలం

- సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది..

తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు : జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :

**వరంగల్, అక్టోబర్ 5:** ప్రజావాణి కార్యక్రమంలో పిటిషన్ సమర్పించిన దుగ్గొండి మండలం పోనకల్ గ్రామానికి చెందిన గట్ల సురేందర్, తండ్రి మంకయ్య, సోమవారం ఆవేదనతో పెట్రోల్ పోసుకున్న ఘటన చోటుచేసుకుంది. అనంతరం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పిటిషనర్‌తో మాట్లాడి వివరాలను తెలుసుకుని, ఆయన నుంచి స్వయంగా వాగ్మూలాన్ని నమోదు చేయించారు.

గట్ల సురేందర్ తన సమస్యకు సంబంధించి 06.07.2026న ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించారు.



దీనిపై జిల్లా కలెక్టర్ 22.08.2026న జిల్లా కలెక్టరేట్‌లో విచారణ (హియరింగ్) నిర్వహించారు. ఈ విచారణకు పిటిషనర్ తమ్ముడు గట్ల రాజు హాజరయ్యారు. విచారణ సందర్భంగా సంబంధిత అంశంపై నర్సంపేట సివిల్ జడ్జి కోర్టులో కేసు నంబర్ 199/224 పెండింగ్‌లో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ విషయాన్ని 30.09.2026న ఎండార్స్‌మెంట్ ద్వారా పిటిషనర్‌కు తెలియజేశారు. అయినప్పటికీ, సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో గట్ల సురేందర్ ఆవేదనకు గురై పెట్రోల్ పోసుకున్నాడు. అనంతరం తన చర్య పట్ల పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ, ఇలాంటి పొరపాటును ఇకపై పునరావృతం చేయనని, తనను దయతో క్షమించాలని కోరుతూ స్వయంగా వాగ్మూలం రాసి జిల్లా అధికారులకు అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ, "సమస్య ఏదైనా పరిష్కారం ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనూ తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు. సమస్యకు సంబంధించిన అంశం కోర్టు పరిధిలో ఉన్నందున, కోర్టు తీర్పు వెలువడే వరకు సంయమనం పాటించాలి" అని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ యంత్రాంగాన్ని ఆశ్రయించాలని, ఆవేశంలో ఎలాంటి ప్రమాదకర నిర్ణయాలు తీసుకోవద్దని కలెక్టర్ సూచించారు.

## హనుమకొండ కార్యాలయ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :





హనుమకొండ సుబేదారిలోని జిల్లా పరిషత్ కు సంబంధించిన స్థలం, శిథిలావస్థకు చేరిన భవనాలు, ఖాళీ ప్రదేశాలను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి సోమవారం పరిశీలించారు. హనుమకొండ తహసీల్దార్ కార్యాలయ ఏర్పాటుకు అనువైన స్థలాన్ని గుర్తించే ప్రక్రియలో భాగంగా కలెక్టర్ స్థల పరిశీలన చేశారు. క్వార్టర్స్, ఖాళీ స్థలానికి సంబంధించిన వివరాలను జెడ్పీ సీఈఓ శేషాద్రి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాసరావు కలెక్టర్‌కు వివరించారు. అందుబాటులో ఉన్న ఖాళీ స్థలంను కలెక్టర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరితగతిన పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద








**మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

**వరంగల్, అక్టోబర్ 05, 2026:**జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

సోమవారం నిర్వహించిన ప్రజావాణికి మొత్తం 248 దరఖాస్తులు వచ్చాయని, వాటిలో రెవెన్యూ శాఖకు 90, జీడబ్ల్యూఎంసీకి 61, హౌసింగ్ శాఖకు 13, డీఆర్డీవో 24, రాగా ఇతర శాఖలకు సంబంధించిన 48 దరఖాస్తులు వచ్చాయి.

అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్ చేసి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

ఈ ప్రజావాణిలో రెవెన్యూ, హౌసింగ్, జీడబ్ల్యూఎంసీ, డిఆర్డిఓ శాఖల పరిధిలో అధికంగా దరఖాస్తు వచ్చాయని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజావాణి దరఖాస్తులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ జిల్లాలో వివిధ సమస్యల పై వచ్చే పిటిషనర్లు సంయమనం పాటించాలని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని, దేనికైనా సమయం వచ్చే వరకు వేచి ఉండాలని ఆవేశాలతో అర్థాలకు కారణాలు కావద్దని పిటిషన్లకు జిల్లా కలెక్టర్ సూచించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డియార్వో విజయలక్ష్మి , జడ్పీ సీఈవో వసంత, డీఎంహెచ్వో డా. రాజి రెడ్డి,కలెక్టరేట్ సూపరిడెంట్ విశ్వప్రసాద్, హౌసింగ్ డి ఇ విష్ణు వర్ధన్ రెడ్డి తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# హనుమకొండ విజయ డెయిరీ పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**





తెలంగాణ రాష్ట్రంలోని ప్రముఖ పాల ఉత్పత్తుల సంస్థ విజయ డెయిరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పాల ఉత్పత్తుల విక్రయ కేంద్రాలను సోమవారం హనుమకొండలో ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి గారు, హనుమకొండ జిల్లా కలెక్టర్ శ్రీమతి చాహత్ బాజ్ పాయి గారు ముఖ్య అతిథులుగా హాజరై ఈ కేంద్రాలను ప్రారంభించారు.

హనుమకొండ బస్టాండ్ ఆవరణలో, అలాగే ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విజయ డెయిరీ పాల ఉత్పత్తుల కేంద్రాలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తుల కేంద్రంలో ఏర్పాటు చేసిన వివిధ రకాల ఉత్పత్తులను వారు పరిశీలించారు.

ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడంలో విజయ డెయిరీ కీలక పాత్ర పోషిస్తోందని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ప్రజలకు, ముఖ్యంగా బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులు, ఆసుపత్రులకు వచ్చే రోగులు, వారి సహాయకులు, సిబ్బందికి విజయ డెయిరీ ఉత్పత్తులు సులభంగా అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను ఏర్పాటు చేయడం ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

ప్రభుత్వ సంస్థల ఆధ్వర్యంలో నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు చేరువ చేయడంతో పాటు, వినియోగదారులకు సౌకర్యవంతమైన ప్రదేశాల్లో విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా విజయ డెయిరీ ఉత్పత్తులకు మరింత ఆదరణ లభించే అవకాశం ఉందన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇలాంటి సేవలను మరింత విస్తరించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా విజయ డెయిరీ విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు ఈ కేంద్రాలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రాంతాల్లో ఇటువంటి కేంద్రాల ఏర్పాటు ద్వారా నాణ్యమైన పాల ఉత్పత్తులను సులభంగా పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి విజయ డెయిరీ సిబ్బందితో మాట్లాడి విక్రయ కేంద్రంలో అందుబాటులో ఉన్న పాల ఉత్పత్తులు, వాటి విక్రయ విధానం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన ఉత్పత్తులు అందేలా అవసరమైన ప్రమాణాలను పాటించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ డీడీ ధనరాజ్. జీఎంహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలకమండలి సభ్యులు ఈవి శ్రీనివాసరావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లా.బాలసదనం చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి.








**- మెరుగైన వసతులు కల్పించాలి.**

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

**మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**

బాలసదనంలోని చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం లోని ఆర్ అండ్ బి అతిథి గృహం ఎదురుగా ఉన్న బాలసదనాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు.

బాలికలకు కల్పిస్తున్న వసతులు, అందిస్తున్న ఆహారం, విద్య, సంరక్షణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బాలసదనంలో ప్రవేశం పొందే బాలికల పరిస్థితులు, ప్రవేశ ప్రక్రియను అధికారులు కలెక్టర్‌కు వివరించారు. తల్లిదండ్రులు లేని బాలికలు, తల్లి లేదా తండ్రిని కోల్పోయిన బాలికలతో పాటు కుటుంబ పరిస్థితుల కారణంగా సరైన సంరక్షణ, చదువుకు దూరమవుతున్న బాలికలకు ఆశ్రయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

బాలికలకు వసతితో పాటు ఉదయం అల్పాహారం, సాయంత్రం చిరుతిండి, రాత్రి భోజనం అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. పాఠశాల రోజుల్లో మధ్యాహ్న భోజనం పాఠశాలలోనే తీసుకుంటారని, సెలవు రోజుల్లో బాలసదనంలోనే అందిస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి వచ్చేందుకు ప్రత్యేకంగా అద్దె వాహనాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా క్రమం తప్పకుండా యోగా నేర్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలసదనంలో కల్పిస్తున్న వసతులు బాగున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు.

అనంతరం చిన్నారులకు పౌష్టికాహార లడ్డూలను పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బాలసదనంలోని చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. బాలికల విద్య, ఆరోగ్యం, సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అవసరాలను గుర్తించి తగిన సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

చిన్నారులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగేలా ప్రోత్సహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. బాలసదనంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తూ, చదువుతో పాటు యోగా, ఆటలు, ఇతర సృజనాత్మక కార్యక్రమాల్లో పాల్గొనేలా చూడాలని సూచించారు. బాలికలతో తరచూ మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఓంకార్, జిల్లా మిషన్ సమన్వయకర్త రమాదేవి, బాలల సహాయ సమన్వయకర్త నరేష్, బాలసదనం పర్యవేక్షకురాలు శ్యామల, సిబ్బంది పాల్గొన్నారు.

## దేవాపూర్‌లో వైద్య శిబిరం బీపీ, షుగర్‌తో పాటు సీజనల్ వ్యాధులకు పరీక్షలు

**కాసిపేట, అక్టోబర్ 05 (మన మీ వార్త మండల ప్రతినిధి) :**

దేవాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు వైద్య సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, జ్వరం, దగ్గు, జలుబు, విషజ్వరాలు తదితర సమస్యలకు పరీక్షలు చేసి అవసరమైన మందులను అందజేశారు.వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇళ్ల చుట్టూ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని వైద్య సిబ్బంది సూచించారు. జ్వరం తదితర లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిడం రాందాస్, పంచాయతీ కార్యదర్శి కవిత, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఎంఎల్‌హెచ్‌పీ వైద్యురాలు డాక్టర్ సాయి శరణ్య, ఏఎన్ఎంలు పి. పద్మ, ఆర్. మాలతి, ఆశా కార్యకర్తలు కళావతి, లక్ష్మీ, లీలాకుమారి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి

**- మహబూబాబాద్,పాత జాబితాలో పేరు ఉన్నా కొత్తగా నిర్దేశిత విధానంలో దరఖాస్తు తప్పనిసరి.**

**- ఎమ్మెల్సీ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి**

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్.**

**మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలి అని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అన్నారు.

సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరం ప్రజావాణి కార్యక్రమంలో వరంగల్- ఖమ్మం- నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటర్ల జాబితాలో పట్టభద్రులైన ఓటర్లు ఓటరుగా నమోదు చేసుకోవడంపై జిల్లాస్థాయి అధికారులు, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.అనిల్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా వరంగల్- ఖమ్మం- నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటర్ల జాబితాలో ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం వెలువరించిన నియమ నిబంధనలు, దరఖాస్తు చేసే విధానం, గడువు, తదితర వివరాలను కలెక్టర్ స్నేహ శబరిష్ ప్రజావాణి లో పాల్గొన్న అధికారులకు క్లుప్తంగా వివరించారు.

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై విస్తృతంగా అవగాహన కల్పించాలని, అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా ఫారం-18 దరఖాస్తులు సమర్పించేలా సహకరించాలని తెలిపారు. 01-11-2023 నాటికి కనీసం 3 సంవత్సరాల డిగ్రీ పూర్తి చేసి అర్హత కలిగిన అభ్యర్థులు Form-18 దరఖాస్తును AERO లకు (లేదా) నియమిత అధికారికి సమర్పించాలన్నారు.

దరఖాస్తుతో పాటు విద్యార్హతకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు, అవసరమైన ఇతర పత్రాలను జత చేయాలని సూచించారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలనుకునే వారు తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి అధికారిక వెబ్‌సైట్ [https://ceotelangana.nic.in/]ను సందర్శించవచ్చని తెలిపారు.

పట్టభద్రుల ఓటరు జాబితాల నూతన తయారీ ప్రక్రియలో భాగంగా, ఇప్పటికే ఓటరు జాబితాలో పేర్లు ఉన్నవారు సైతం నిర్దేశిత విధానం ప్రకారం తిరిగి దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పాత ఓటరు జాబితాలో పేరు ఉండటం ఒక్కటే ప్రస్తుత ప్రక్రియలో నమోదుకు సరిపోదని, అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు నిర్ణీత విధానంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## బీజేవైఎం జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ గా

**- నియమితులైన వావిలాల వెంకటరమణ**

**పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనుమకొండ జిల్లా బీజేవైఎం ఐటీ సెల్ కన్వీనర్ గా వావిలాల వెంకటరమణ గారిని నియమిస్తూ జిల్లా బీజేవైఎం అధ్యక్షులు పున్నం వేణు నియామక పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వావిలాల వెంకటరమణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అందించినట్టి బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తానని తెలిపారు. బిజెపి సంసగత నిర్మాణంలో తన వంతు పాత్రను సహాయ శక్తుల నిర్వర్తిస్తానన్నారు. తన దృష్టికి వచ్చిన ఎలాంటి సమస్య పైన అయినా తప్పకుండా స్పందిస్తూ పార్టీ బలోపేతనికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. తన నియామకానికి సహకరించిన బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు కుందే గణేష్ గారికి,హనుమకొండ జిల్లా బిజెపి అధ్యక్షులు కొలను సంతోష్ రెడ్డి గారికి, బి జె వై ఎం జిల్లా అధ్యక్షులు పున్నం వేణు గారికి,పరకాల పట్టణం బీజేపీ అధ్యక్షులు గాజుల నిరంజన్ గారికి మరియు రాష్ట్ర ఉ జిల్లా పేరుపేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటాలి:చల్లా ధర్మారెడ్డి

**పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా నడికుడ:వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పిలుపునిచ్చారు.

నడికుడ మండల కేంద్రంలో పట్టభద్రుల ఓటరు నమోదుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ బలమేంటో చూపించేలా ప్రతి కార్యకర్త క్షేత్రస్థాయిలో పనిచేయాలని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించడాన్ని పార్టీ శ్రేణులు అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో ప్రజలు, పట్టభద్రులు ఎదుర్కొంటున్న సమస్యలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఇచ్చిన హామీలు, అమలవుతున్న తీరుపై పట్టభద్రులకు వాస్తవాలను వివరించాలి. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ సాధించిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తుచేస్తూ క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని అన్నారు. ప్రతి పట్టభద్రుడితో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల వరకు ప్రతి దశలో సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధించగలమని అన్నారు.

మండలంలోని ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఓటరు నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని, నాయకులు, కార్యకర్తలు బాధ్యతలు పంచుకుని పనిచేయాలని చల్లా ధర్మారెడ్డి దిశానిర్దేశం చేశారు.

సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనగామ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలి

- కొనుగోలు కేంద్రాలపై కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు
- రైతులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

**మన మీ వార్త అక్టోబర్ 05 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి :**



వానాకాలం (ఖరీఫ్) 2026-27 సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులను పకడ్బందీగా కల్పించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు.

సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లపై రెవెన్యూ, పౌరసరఫరాలు, వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, డీఆర్డీఓ, తూనికలు కొలతలు, రవాణా, తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 202 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లను నిర్దేశిత వ్యవధిలో పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వివరాలు, రైతులకు అందాల్సిన సేవలు, ధాన్యం నాణ్యతా ప్రమాణాలపై పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల ద్వారా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు.

రైతులకు ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే పరిష్కరించేందుకు కలెక్టరేట్‌లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయగా, 1800-425-6605 టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులకు సూచించారు.

ధాన్యం రవాణా చేసే వాహనాలు నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూడాలని, అన్ని వాహనాలకు జీపీఎస్ (లేదా) వాహన స్థాన నిర్ధారణ వ్యవస్థ ఏర్పాటు చేసి, నిరంతరం పర్యవేక్షించాలని రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.

ధాన్యం నాణ్యతకు సంబంధించిన నాణ్యతా ప్రమాణాలపై రైతులు, కొనుగోలు కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించాలని సూచించారు. ప్యాడీ క్లీనర్లను సక్రమంగా వినియోగించి, నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన తేమ శాతం నిబంధనల మేరకు ధాన్యాన్ని ఆరబెట్టి నేరుగా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి మద్దతు ధర పొందేలా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.

ప్రతి కొనుగోలు కేంద్రంలో ట్రక్ షీట్ నిర్వహణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. లారీలో లోడ్ చేసిన ధాన్యం బస్తాల సంఖ్య, బరువు, తదితర వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు.

వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, లోతట్టు ప్రాంతాల్లో కాకుండా సురక్షిత ప్రదేశాల్లో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి కేంద్రంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడడంతో పాటు తాగునీరు, నీడ, విద్యుత్, తదితర కనీస సౌకర్యాలు కల్పించాలని, అవసరమైన రిజిస్టర్లను నిర్వహించాలని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సరిపడా టార్పాలిన్లు, తేమ కొలిచే యంత్రాలు, తగినన్ని గన్నీ బ్యాగులు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రైతులకు ముందస్తుగా టోకెన్లు జారీ చేయాలని, రైతుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జిల్లా వ్యాప్తంగా కేటాయించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని, రైతులు పండించిన ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉన్నందున అంతకుముందే అన్ని సన్నాహాలను పూర్తి చేయాలని తెలిపారు.

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ట్రక్కుల్లో లోడింగ్, అన్‌లోడింగ్ చేసేందుకు ఎలాంటి కూలీల సమస్యలు తలెత్తకుండా అవసరమైన సంఖ్యలో కూలీలను ముందస్తుగా ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు.

ధాన్యం నిల్వ, రవాణాకు సంబంధించి ముందస్తుగా క్షేత్రస్థాయిలో పర్యటించి గోదాములను పరిశీలించాలని, వాటి సామర్థ్యాన్ని పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.

సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేసి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో డీఆర్డీఓ భాస్కర్, జిల్లా సివిల్ సప్లై అధికారి సురేష్ రెడ్డి, డీఎం సివిల్ సప్లై హాతీరామ్, డీసీఓ కరుణ, ఎల్‌డీఎం ప్రతిభ, తూనికలు కొలతల శాఖ అధికారి ఝాన్సీ, రవాణా, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఈసీ జ్ఞానేష్ కుమార్ వెంటనే రాజీనామా చేయాలి

- రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ డిమాండ్

**పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



భూపాలపల్లి జయశంకర్ జిల్లా రేగొండ మండల:లి కేంద్ర ఎన్నికల సంఘం (ఈ సి) అధికారి జ్ఞానేష్ కుమార్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ రేగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్నం రవి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం అండతో ఎన్నికల జాబితాలో అక్రమంగా ఓట్ల తొలగింపు జరుగుతుందనే ఆరోపణలు వస్తున్నాయని అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమని, అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించడం సరికాదని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం అధికారి జ్ఞానేష్ కుమార్‌ను వెంటనే విధుల నుంచి తొలగించాలని రేగొండ మండల కాంగ్రెస్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.

అక్టోబర్ 9న భూపాలపల్లిలో నిర్వహించనున్న మెగా జాబ్ మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని పున్నం రవి కోరారు. ఈ జాబ్ మేళా ద్వారా లభించే ఉద్యోగ అవకాశాలను యువత వినియోగించుకుని తమ భవిష్యత్తుకు మంచి బాటలు వేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వ్యవసాయ కమిటీ చైర్మన్ గుటోజు కృష్ణయ్య రేగొండ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి, మైస బిక్షపతి, మేకల బిక్షపతి, మేకల రవికుమార్, పట్టెం శంకర్, ఎడ్ల మల్లారెడ్డి, ఆర్.జి. తండా సర్పంచ్ వీర్ నాయక్, కటం గురు మనోహర్ రెడ్డి, ఖ్యాతం సదయ్య, నాసం సామి రాంబాబు, పోచంపల్లి ఉపసర్పంచ్ రవి, నిమ్మల విజేందర్, రొంటాల వెంకటస్వామి, కోలెపాక ప్రసంగి, పున్నం సాయి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లను సన్మానించిన చందుపట్ల కీర్తి రెడ్డి

**పరకాల ప్రతినిధి మన మీ వార్త రేగొండ:**

దేశాభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నవభారత నిర్మాణానికి అహర్నిశలు కృషి చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజా సేవను పురస్కరించుకుని నిర్వహిస్తున్న సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కోటంచ, దుంపిల్లపల్లి గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

మండల అధ్యక్షులు బండి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు చందుపట్ల కీర్తి రెడ్డి , మాజీ జిల్లా అధ్యక్షులు వెన్నంపల్లి పాపన్న హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

అనంతరం కీర్తి రెడ్డి మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా జీవితంలో సేవకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే మోదీ స్ఫూర్తితో సేవా సంకల్ప్ అభియాన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలతో మమేకమై సేవా భావాన్ని మరింత విస్తృతం చేయడం, సమాజంలోని ప్రతి వర్గానికి సంక్షేమ కార్యక్రమాలను చేరువ చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.

చిన్నారుల ఆరోగ్యం, పోషణ విషయంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఆరోగ్య సేవలను అందించడంలో ఆశా వర్కర్లు చేస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కీర్తి రెడ్డి అన్నారు. మహిళలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం కోసం వారు అందిస్తున్న సేవలు సమాజానికి ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ప్రజా సేవలో భాగస్వాములు కావాలని కీర్తి రెడ్డి పిలుపునిచ్చారు. "సేవే సంకల్పం.. ప్రజా సంక్షేమమే లక్ష్యం" అనే స్ఫూర్తితో ముందుకు సాగాలని అన్నారు.



ఈ కార్యక్రమంలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మ కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షులు పోలసాని తిరుపతిరావు బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ గాలిఫ్ ఉప సర్పంచ్ రంజిత్ వార్డ్ మెంబర్ వరలక్ష్మి రాజు జిల్లా నాయకులు మాత శంకర్ బూత్ అధ్యక్షులు విజేందర్ కర్ణాకర్ మై భారత్ జిల్లా కన్వీనర్ ఎర్ర రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా రాణి దుర్గావతి జయంతి వీరనారి త్యాగం యువతకు స్ఫూర్తిదాయకం

**కాసిపేట, అక్టోబరు 5 (మన మీ వార్త మండల ప్రతినిధి) :**



మండల కేంద్రంలోని కొండాపూర్ కుమురం భీం చౌరస్తా వద్ద వీరనారి రాణి దుర్గావతి జయంతి వేడుకలను సోమవారం నాయకులు, స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాణి దుర్గావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 1524 అక్టోబరు 5న జన్మించిన రాణి దుర్గావతి గోండ్వానా సామ్రాజ్య పాలకురాలిగా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. మొఘలుల దండయాత్రలను ధైర్యసాహసాలతో ఎదుర్కొని, రాజ్యాన్ని, ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు ప్రాణత్యాగం చేసిన వీరవనితగా ఆమె చరిత్రలో నిలిచారని కొనియాడారు. రాణి దుర్గావతి చూపిన తెగువ, చేసిన త్యాగం నేటి యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో తాటిగూడ సర్పంచ్ మడావి వెంకటేష్, మంచిర్యాల జిల్లా తుడుం దెబ్బ అధ్యక్షుడు మడావి వెంకటేశ్వర్, ఉపాధ్యక్షుడు కనక రాజు, ఆదివాసీ సేన జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ శంకర్, ఉపాధ్యక్షుడు కోడప అనంతరావు, కాసిపేట మండల ఆదివాసీ సేన ఉపాధ్యక్షుడు ఆత్రం సంజీవ్, జిల్లా ఉపాధ్యక్షుడు కుర్సెంగ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## అక్కెల్ల సారయ్య కుటుంబాన్ని పరామర్శించిన చల్లా..

**పరకాల ప్రతినిధి మన మీ వార్త :**



హనంకొండ జిల్లా దామెర మండలం ఊరుగొండ గ్రామానికి ఇటీవలే మృతిచెందిన అక్కెల్ల సారయ్య కుటుంబాన్ని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబసభ్యులను ఓదార్చారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి బకాయిలు వెంటనే చెల్లించాలి

- ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి

**కాసిపేట, అక్టోబర్ 05 (మన మీ వార్త మండల ప్రతినిధి) :**



ప్రభుత్వాల విధానాల కారణంగానే సింగరేణి కాలరీస్ కంపెనీ నష్టాల బాటలో పయనిస్తోందని ఏఐటీయూసీ కేంద్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి వెంకటస్వామి ఆరోపించారు. సింగరేణి కంపెనీకి ట్రాన్స్‌కో, జెన్‌కో నుంచి రావాల్సిన రూ.59 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. మందమరి ఏరియాలోని గనులు, వివిధ విభాగాల్లో ఉత్పత్తి, ఉత్పాదకతకు అవసరమైన సామగ్రి, పనిముట్లు సక్రమంగా సరఫరా కావడం లేదని ఆయన పేర్కొన్నారు. గాలి సరఫరా, పని ప్రదేశాల మెరుగుదల వంటి అంశాలపైనా తగిన శ్రద్ధ చూపడం లేదని ఆరోపించారు. కార్మికులపై పనిభారం పెంచుతూ పారిశ్రామిక సంబంధాలను దెబ్బతీసే విధంగా యాజమాన్యం వ్యవహరిస్తోందని విమర్శించారు. ఇంజినీరింగ్, సర్వే, మైనింగ్ సిబ్బంది, లైన్‌మన్లు, కోల్‌కట్టర్, సపోర్ట్‌మెన్ తదితర విభాగాల మధ్య సమన్వయం దెబ్బతినడం వల్ల ఉత్పత్తితో పాటు భద్రతపైనా ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. సంబంధిత కార్మిక చట్టాలు, గని భద్రతా నిబంధనలను పాటిస్తూ అన్ని విభాగాలను సమర్థంగా నిర్వహించాలని యాజమాన్యాన్ని కోరారు.

సింగరేణి కార్మికులకు దసరా సందర్భంగా ప్రకటించాల్సిన లాభాల వాటాను ఇప్పటివరకు ప్రకటించకపోవడం విచారకరమన్నారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు పెన్షన్, సీఎంపీఎఫ్ చెల్లింపుల్లో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**7న సీఎంపీఎఫ్ కార్యాలయం ముట్టడి**

సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ అక్టోబరు 7న సాయంత్రం 4 గంటలకు గోదావరిఖని సీఎంపీఎఫ్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెంకటస్వామి తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక హక్కుల పరిరక్షణ, సింగరేణి సంస్థను కాపాడుకోవడానికి భవిష్యత్తులో చేపట్టే పోరాటాలకు కార్మికులు సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి వి. రాజేందర్, సహాయ కార్యదర్శులు పార్వతి, సురేష్, ఏఐటీయూసీ నాయకులు సందీప్, సంతోష్, మైన్స్ కమిటీ, భద్రతా కమిటీ సభ్యులు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఏఐటీయూసీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## తాటిగూడలో ఘనంగా కాకా జయంతి

- పేదలు, కార్మికుల సంక్షేమానికి విశేష కృషి



**కాసిపేట, అక్టోబరు 5 (మన మీ వార్త మండల ప్రతినిధి) :**

కాసిపేట మండలం తాటిగూడ గ్రామపంచాయతీ పరిధిలో కేంద్ర మాజీ మంత్రి, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమకారుడు, అణగారిన వర్గాల ప్రతినిధి దివంగత గడ్డం వెంకటస్వామి (కాకా) జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడావి వెంకటేష్ కాకా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో గడ్డం వెంకటస్వామి పోషించిన పాత్ర విశేషమైనదని అన్నారు. కార్మికులు, పేదలు, అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన జీవితాంతం కృషి చేశారని గుర్తుచేశారు. కాకా ఆశయాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్నపూర్ణ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## గర్గుల్‌లో బీఆర్ఎస్‌లో చేరిన అంబేద్కర్ సంఘం నాయకులు

**గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో పార్టీలో చేరికలు**

**కామారెడ్డి :** గర్గుల్ గ్రామానికి చెందిన అంబేద్కర్ సంఘం నాయకులు గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో సోమవారం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అంబేద్కర్ సంఘం నాయకులు చిట్టపురం రవి, నిమ్మ బాబులు, మద్దెల రాజేందర్, నిమ్మ గంగాధర్, చిట్టపురం శేఖర్ బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా గంప గోవర్ధన్ వారికి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు తెలిపారు. గ్రామంలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా పార్టీలో చేరిన నాయకులు పేర్కొన్నారు.

# పోషకాహారంతోనే చిన్నారుల సంపూర్ణ ఆరోగ్యం







**ప్రతి కుటుంబం సమతుల్య ఆహారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి**
**పోషణ్ మాసం కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్**

**కామారెడ్డి :** పోషకాహారం తీసుకోవడం ద్వారా చిన్నారులు ఆరోగ్యంగా ఎదగడంతో పాటు మహిళలు, గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు అవకాశం ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అన్నారు. పోషణ్ అభియాన్‌లో భాగంగా నిర్వహించిన పోషణ్ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మహిళలు, చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో ముఖ్యమని తెలిపారు. ప్రతి కుటుంబం చిన్నారులకు సమతుల్య ఆహారం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. గర్భిణీలు, బాలింతలు కూడా పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా తల్లి, బిడ్డ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహార సేవలను మహిళలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల సేవలపై తల్లిదండ్రులు అవగాహన కలిగి ఉండాలని, పిల్లల ఆరోగ్యం విషయంలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. పోషకాహారంతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.

గర్భిణీలకు శ్రీమంతం.. ఆడపిల్లలకు బేబీ కిట్లుపోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా గర్భిణీ స్త్రీలకు శ్రీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన ఆడపిల్లలకు బేబీ కిట్లను అందజేశారు. చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లి, బిడ్డ ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంగన్‌వాడీ సిబ్బంది వివరించారు. మహిళలు, చిన్నారుల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, పోషకాహార కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చైర్‌పర్సన్ సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ బాను ప్రకాష్, సీడీపీఓ సుజాత, ఇన్‌చార్జి డీడబ్ల్యూఓ అధికారి వెంకటేష్, సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సిబ్బంది, గర్భిణీ స్త్రీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# చివరి ఆయకట్టు రైతుల పొలాలకు సాగునీరు







**25వ నంబర్ కెనాల్‌లో అడ్డంకులు తొలగింపు.. మరో రెండు రోజులు నీరు కొనసాగించాలని పోచారం ఆదేశం**

**బాన్సువాడ :** నిజాంసాగర్ 25వ నంబర్ కెనాల్ ద్వారా చివరి ఆయకట్టు రైతుల పొలాలకు సాగునీరు అందేలా రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. కెనాల్ ద్వారా నీరు సక్రమంగా అందక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని కొల్లూరు, నాగారం, దామరంచ, అన్నారం గ్రామాల రైతులు పోచారం శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. రైతుల సమస్యను తెలుసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డి వెంటనే ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి 25వ నంబర్ కెనాల్‌ను పరిశీలించి, నీటి ప్రవాహానికి అడ్డుగా ఉన్న మట్టి, వ్యర్థాలను తొలగించేలా చర్యలు చేపట్టారు. దీంతో కెనాల్‌లో నీటి ప్రవాహం మెరుగుపడి చివరి ఆయకట్టు వరకు సాగునీరు చేరింది. కొల్లూరు, నాగారం, దామరంచ, అన్నారం గ్రామాల పరిధిలోని రైతుల పొలాలకు నీరు చేరడంతో చివరి దశలో ఉన్న పంటలకు ఎంతో ప్రయోజనం చేకూరింది. ఇప్పటికే పంటలు కీలక దశలో ఉన్న సమయంలో సాగునీరు అందడంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. తమ సమస్యను వెంటనే పరిష్కరించి పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకున్న పోచారం శ్రీనివాసరెడ్డికి రైతులు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

**మరో రెండు రోజులు నీరు కొనసాగించాలని సూచన**

25వ నంబర్ కెనాల్ చివరి ఆయకట్టు వరకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా మరో రెండు రోజుల పాటు నిజాంసాగర్ నుంచి కెనాల్‌కు నీటిని కొనసాగించాలని రైతులు పోచారం శ్రీనివాసరెడ్డిని కోరారు. రైతుల అభ్యర్థనపై స్పందించిన ఆయన ఇరిగేషన్ అధికారులకు నీటి సరఫరాను కొనసాగించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. "చివరి ఆయకట్టు రైతు పొలానికి కూడా నీరు అందాలి.. ప్రతి ఎకరం పచ్చగా ఉండాలి" అనే లక్ష్యంతో రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు పోచారం శ్రీనివాసరెడ్డి కృషి చేస్తున్నారని ఆయా గ్రామాల రైతులు పేర్కొన్నారు. చివరి ఆయకట్టు వరకు నీరు చేరడంతో రైతుల్లో సంతృప్తి వ్యక్తమవుతోంది. ఈ కార్యక్రమంలో కొల్లూరు, నాగారం, దామరంచ, అన్నారం గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి పీఏసీఎస్‌లో 2026 వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం.

**కోటగిరి :** కోటగిరి మండలం లోనికొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ( పీ ఏసీ ఎస్ ) కొత్తపల్లి గ్రామంలో 2026 వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు.
ఈ కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ కొత్తపల్లి సంఘం చైర్మన్ డాక్టర్ వెనిగళ్ళ సునీల్ కుమార్ చౌదరి గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోటగిరి మండల తహసీల్దార్ ఎమ్మార్వో కె. గంగాధర్ హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచులు పి. గంగాధర్ , కోర్ర రవి , వెల్లంకి సీతాకుమారి రంగదాస్ చౌదరి , శ్యామ్ కీ శంకర్ , డైరెక్టర్లు వల్లేపల్లి శ్రీనివాసరావు , గుగులోతు తుకారాం గారు, మండల వ్యవసాయ అధికారి రాజు గారు, ఏ ఈ ఓ, రాంపూర్ షేక్ గౌస్ , ఏఈఓ కొత్తపల్లి ప్రశాంత్ , సీఈవో కమలేష్ , సుదర్శన్ , రైతులు మరియు ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా చైర్మన్ డాక్టర్ వెనిగళ్ళ సునీల్ కుమార్ చౌదరి మాట్లాడుతూ, రైతుల సంక్షేమమే సహకార సంఘాల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రస్తుతం వరి ధాన్యానికి మార్కెట్లో లభిస్తున్న ధరలను దృష్టిలో ఉంచుకొని, దొడ్డు వడ్ల నుంచి సన్న వడ్ల వరకు రైతులకు కనీసం ?4,500 నుంచి ?5,000 వరకు అధికారిక మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించాలని కోరారు.
ఈ అంశంపై పీఏసీఎస్ జనరల్ బాడీ సమావేశంలోనూ, ఇతర సమావేశాల్లోనూ తీర్మానం చేసి, రైతుల తరఫున ప్రభుత్వానికి ప్రతిపాదన పంపించనున్నట్లు తెలిపారు. అంతేకాకుండా తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు కూడా ఇదే అంశంపై తీర్మానాలు చేసి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.
ప్రభుత్వం అధికారికంగా 4,500--?5,000 మద్దతు ధరను ప్రకటిస్తే, రైతులకు ప్రభుత్వ కొనుగోలు ద్వారా ఒక భరోసా ఏర్పడటమే కాకుండా, ప్రైవేటు వ్యాపారులు కూడా ఆ ధరకు మించి కొనుగోలు చేసే అవకాశం ఏర్పడుతుందని, తద్వారా రైతులకు మరింత మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని చైర్మన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రైవేటు మార్కెట్లో క్వింటాల్‌కు సుమారు 4,000 వరకు ధర లభిస్తున్న పరిస్థితుల్లో, రానున్న రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వ మద్దతు ధర ఒక కనీస ధరకు భరోసా కల్పిస్తుందని అన్నారు. "రైతు బాగుంటేనే వ్యవసాయం బాగుంటుంది... వ్యవసాయం బాగుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. రైతుకు సరైన ధర లభించడమే రైతు



కుటుంబానికి నిజమైన భరోసా" అని చైర్మన్ పేర్కొన్నారు.
రైతులు తమ ధాన్యాన్ని నాణ్యత, తేమ శాతం, మార్కెట్ ధరలను పరిశీలిస్తూ, అందుబాటులో ఉన్న మంచి ధరకు విక్రయించుకోవాలని సూచించారు. రైతుల అభివృద్ధి, సంక్షేమం, ఆర్థిక భద్రతే కొత్తపల్లి పీఏసీఎస్ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఏర్పడే పాలకవర్గాలు కూడా రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రతిపాదనను కొనసాగిస్తూ, ప్రభుత్వంపై సానుకూల ఒత్తిడి తీసుకువచ్చి రైతులకు మెరుగైన మద్దతు ధర సాధించేందుకు కృషి చేయాలని చైర్మన్ కోరారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్‌పై పోలీసుల తనిఖీలు

**ఇందల్వాయి: :** ఇందల్వాయి మండల కేంద్రంలో ఎస్సై సుమలత ఆధ్వర్యంలో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలకు సరైన పత్రాలు లేకుండా నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి ఘటనలను అరికట్టేందుకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై సుమలత తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని ఆమె పేర్కొన్నారు. వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపినా, సరైన పత్రాలు లేకుండా రోడ్డుపైకి వచ్చినా వాహనాన్ని సీజ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.





ఈ తనిఖీల్లో హెడ్ కానిస్టేబుల్ గంగాధర్, కానిస్టేబుల్ రఘు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## హామీలు అమలు చేయాలని నిరాహార దీక్షకు సిద్ధం

**– పల్లంగూడ సమస్యలు పరిష్కరించాలని సర్పంచ్, గ్రామస్థుల డిమాండ్**

**కాసిపేట, అక్టోబర్ 05 (మన మీ వార్త మండల ప్రతినిధి) :**



పల్లంగూడ గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాసిపేట 2వ ఇంక్లైన్ మేనేజర్ కార్యాలయం ఆవరణలో నిరాహార దీక్ష చేపట్టేందుకు సర్పంచ్, గ్రామస్థులు, భూ నిర్వాసితులు సిద్ధమయ్యారు. పల్లంగూడ గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణ సందర్భంగా గ్రామానికి అవసరమైన మంచినీరు, విద్యుత్ దీపాలు, సైడ్‌డ్రెయిన్లు, సీసీ రోడ్లు, క్రీడా మైదానం, వ్యాయామశాల తదితర మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. అయితే ఇప్పటివరకు హామీల్లో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మౌలిక వసతుల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యలను పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేసి గ్రామ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి యాజమాన్యం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించకపోతే నిరాహార దీక్షను కొనసాగిస్తామని సర్పంచ్, డి. విజయ చందు గ్రామస్థులు, భూ నిర్వాసితులు తెలిపారు.

## కాకా వెంకటస్వామి 97 వ జయంతి సందర్భంగా ఘన నివాళులు

**-అరుంధతీయ బంధు సేవా మండలి మెదక్ జిల్లా అధ్యక్షులు పెద్దింటి సత్యం.**

**మెదక్ అక్టోబర్ 5 మన మీ వార్త ప్రతినిధి :**



మాజీ కేంద్ర కార్మిక శాఖ మంత్రి, కీర్తిశేషులు జి. వెంకటస్వామి 97 వ జయంతి సందర్భంగా మెదక్ జిల్లా అరుంధతీయ బంధు సేవ మండలి మెదక్ జిల్లా అధ్యక్షులు పెద్దింటి సత్యం మాట్లాడుతు వెంకటస్వామి ఏడు పర్యాయాలు పార్లమెంటుకు ఎన్నికై,కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు వారి చొరవతో కార్మికులకు రిటైర్మెంట్ అనంతరం పెన్షన్ పథకాన్ని తీసుకొచ్చిన ఘనత వారిదేనని అన్నారు. ఒక్క హైదరాబాద్ లోనే 75 వేల పేదలకు ఇళ్ల పట్టాలు అందించిన ఘనత వెంకటస్వామి దేనని కొనియాడారు.

రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, కార్మిక శాఖ మంత్రివర్యులు శ్రీ వివేక్ వెంకటస్వామి అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కోటి పది లక్షల మంది కార్మికులకు వేతనాలు పెంచిన ఘనత వివేక్ వెంకటస్వామి గారిదని అన్నారు.

-కేంద్ర ప్రభుత్వం కాకా వెంకటస్వామి సేవలను దృష్టిలో ఉంచుకొని వారికి భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామని ఈ సందర్భంగా తెలిపారు.

## ఎల్లారెడ్డి పీఏసీఎస్ చైర్మన్‌గా నాగం గంగారం ఖరారు....

నేడు ప్రమాణస్వీకారం



**ఎల్లారెడ్డి :** ఎల్లారెడ్డి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్‌గా దేవునిపల్లి గ్రామానికి చెందిన నాగం గంగారం, మాత్తమల్ సొసైటీ చైర్మన్ గా బి.జైపాల్ రెడ్డిని నియమిస్తూ ఉన్నతధికారులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. నాగం గంగారం సాధారణ రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి, వ్యవసాయ నేపథ్యం కలిగిన వారని ఆయన ఎల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి నాగం గోపికృష్ణ తండ్రి కావడం గమనార్హం. ఈ సందర్భంగా నాగం గంగారం మాట్లాడుతూ....రైతుల సంక్షేమం కోసం, సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు. తనపై నమ్మకం ఉంచిన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావుకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నేడు ఉదయం ఎల్లారెడ్డి సొసైటీ కార్యాలయంలో ప్రమాణ స్వీకారం ఉంటుందని సొసైటీ సీఈఓ విశ్వనాథ్ తెలిపారు.దింతో నాగం గంగారాం బాధ్యతలు చేపట్టానున్నారు.

## నారాయణ పాఠశాలలో కెరియర్ ఓరియంటేషన్ ప్రోగ్రాం.

**మీర్పేట్ అక్టోబర్ 5 మన మీ వార్త ప్రతినిధి :**




మీర్పేట్ నారాయణ పాఠశాల యొక్క పదవ తరగతి విద్యార్థులకు కెరియర్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ను హస్తినాపురంలో పూజా బ్యాంకెట్ హాలులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా శ్రీ కె రాధాకృష్ణ గారు( కాలేజ్ కోర్ డీన్ డీఎన్ జోన్ ), శ్రీ గోపాల్ రెడ్డి గారు (జి ఎం,తెలంగాణ), శ్రీ రవీంద్ర బాబు గారు( ఏజీఎం విపిజోన్), శ్రీ బాబ్జి గారు ప్రిన్సిపాల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాధాకృష్ణ గారు విద్యార్థుల విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలు సాధించడానికి ఉత్తమ కెరియర్ను నిర్ణయించుకోవడానికి కావలసిన సలహాలు సూచనలు మరియు విద్యార్థులకు ఎన్నో ప్రయోజనకరమైన అంశాలను వివరించారు. రవీంద్ర బాబు గారు విద్యార్థుల విద్యార్థుల యొక్క భవిష్యత్తు లక్ష్యాలను నిర్దేశించుకోవడానికి వారి వారి ఆసక్తులకు తగినట్లుగా సరైన రంగాన్ని ఎంచుకోవడానికి మరియు భవిష్యత్తు ప్రణాళికల గురించిన భయాలను ఒత్తిడిని దూరం చేసుకుని తమలోని ప్రతిభ నైపుణ్యాలను మెరుగుపరచుకోవడానికి ఎన్నో సలహాలు సూచనలు అందించారు. మరియు ప్రిన్సిపల్ బాబ్జి గారు వివిధ కోర్సులు ఉద్యోగాలు అవకాశాలు మరియు పరిశోధనా రంగాలపై అవగాహనను విద్యార్థులకు అందించి విద్యార్థుల యొక్క బంగారు భవిష్యత్తుకు ఎన్నో ముఖ్యమైన సూచనలను అందించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు ఈ కార్యక్రమంలో ఏడి నాగిరెడ్డి, ఏవో మాధవి, టెన్త్ ఇంచార్జ్ రవికుమార్ మరియు ఉపాధ్యాయులు,విద్యార్థులు,తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాల్ని విజయవంతం చేశారు



# 'చట్టం ప్రజలకు అర్థమయ్యేలా ఉండాలి

న్యాయవ్యవస్థ పనితీరులో కరుణ, మానవత్వాల పాత్రను నొక్కి చెబుతూ భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. చట్టం ప్రాథమిక బాధ్యత అది ఎవరిని పాలిస్తుందో ఆ ప్రజలకు సులభంగా అర్థం కావడం, అలానే ప్రజలను ఆ చట్టం కూడా అర్థం చేసుకోవడమేనని వ్యాఖ్యానించారు. ఇక్కడ చట్టం అనేది ప్రజల కష్టాలను, వారి పరిస్థితులను కూడా అర్థం చేసుకోవాలని ఉద్దేశం వచ్చేలా మాట్లాడారు. ఈ సందర్భంగా కోర్టు తీర్పులలో మానవీయ కోణానికి ప్రాధాన్యం ఇవ్వాలని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. ప్రొఫెసర్ (డాక్టర్) ఎన్ ఆర్ మాధవ్ మీనన్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన మెమోరియల్ లెక్చర్ (స్మారక ఉపన్యాసం) కార్యక్రమంలో పాల్గొని ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులు తీర్పులు ఇచ్చే సమయంలో కేసు వెనుక ఉన్న పూర్తి మానవీయ కోణాల్ని కూడా చూడాలని సూచించారు. 'మొదట తీర్పులు ఇచ్చేటప్పుడు కరుణ అంటే ఏంటో మనం తెలుసుకోవాలి. న్యాయ నిర్ణయాలలో కరుణ చూపడం అంటే కేవలం సానుభూతి చూపడమూ, ఉదారతనో కాదు. తీర్పును ఒక వైపునకు మొగ్గు చూపేలా చేసేది అంతకన్నా కాదు. ఒక కేసు వెనుక ఉన్న పూర్తి మానవీయ పరిస్థితుల్ని క్రమశిక్షణతో చూసే నిబద్ధత. న్యాయ నిర్ణయాల్లో కరుణ లేకపోతే చట్టం కేవలం కాగితాల మీద రూల్స్ మాట్లాడే ఒక కఠినమైన వ్యవస్థగా మారిపోతుంది' న్యాయవ్యవస్థలో కనిపించని బాధితులపై కూడా దృష్టి పెట్టాలని సీజేఐ సూచించారు. లైంగిక హింసకు గురైన వ్యక్తులు, విచారణ ఎదుర్కొంటున్న ఖైదీల కుటుంబాలు, దివ్యాంగులు వంటి వారి పరిస్థితులను కూడా న్యాయ ప్రక్రియలో పరిగణనలోకి తీసుకోవాలని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ చెప్పారు. వారి వాదనలు కోర్టు రికార్డులకు చేరకపోయినా వారి ఆవేదనను ఆలకించాల్సిన బాధ్యత న్యాయమూర్తులపై ఉందన్నారు. ఇంకా న్యాయస్థానాల్లో వాదనలు, వెలువడే తీర్పులు



పిటిషనర్లకు సులభంగా అర్థమయ్యే భాషలో ఉండాలని ఇంకా పోలీస్ స్టేషన్ల స్థాయిలోనే న్యాయ సహాయం అందాలని ఆయన పిలుపునిచ్చారు.

**సాంకేతికత న్యాయాన్ని వేగవంతం చేయొచ్చు కానీ!**

ఇదే కార్యక్రమంలో నేషనల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ విక్రమ్ నాథ్ కూడా కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయమూర్తులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలి అంతేకానీ న్యాయం విషయంలో ఏమాత్రం ఉదాసీనంగా వ్యవహరించొద్దని అన్నారు. ఇంకా న్యాయ ప్రక్రియలో సాంకేతికత కీలక పాత్ర పోషించగలదని చెప్పిన ఆయన అది ప్రక్రియను వేగవంతం చేయగలదేమో కానీ న్యాయమైన తీర్పును ఇవ్వలేదని అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ మానవీయ కోణంలో ఆలోచించలేదని వ్యాఖ్యానించారు. మానవ మేధస్సును, న్యాయమూర్తి జీవిత కాలంలో సంపాదించిన అనుభవాన్ని సాంకేతికత భర్తీ చేయలేదని స్పష్టం చేశారు. అందుకే న్యాయమూర్తులకు టెక్నాలజీ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాలేదని పేర్కొన్నారు

**సుప్రీంకోర్టుకు ముగ్గురు కొత్త న్యాయమూర్తులు**

ఇదెలా ఉండగా, కేంద్ర ప్రభుత్వం సోమవారం రోజు దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులను నియమిస్తున్నట్లు నోటిఫికేషన్ విడుదల చేసింది. నియామకాలపై కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సోషల్ మీడియా ద్వారా అధికారిక ప్రకటన చేశారు. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీం కోర్టు కొలిజీయం సెప్టెంబర్ 28న చేసిన సిఫార్సులకు కేంద్రం ఆమోద ముద్ర వేసింది. తాజాగా ముగ్గురు న్యాయమూర్తుల నియామకంతో సుప్రీం కోర్టులో పనిచేస్తున్న న్యాయమూర్తుల సంఖ్య 37కు చేరింది. సుప్రీం కోర్టు మంజూరు చేసిన మొత్తం న్యాయమూర్తుల పోస్టుల సంఖ్య 38 కాగా, ఒక స్థానం ఖాళీగా ఉంది.

జస్టిస్ సునీతా అగర్వాల్- 1990లో న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించిన ఈమె, 2011లో అలహాబాద్ హైకోర్ట్ జడ్జిగా పదోన్నతి పొందారు. 2023 జులై నుంచి గుజరాత్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈమె నియామకంతో సుప్రీం కోర్టులో మహిళా న్యాయమూర్తుల సంఖ్య మూడుకు చేరింది. జస్టిస్ దేవేంద్ర కుమార్ ఉపాధ్యాయ- 2011లో అలహాబాద్ హైకోర్టు జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఈయన, అంతకుముందు ఉత్తర్ ప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలందించారు. 2023 జులైలో బాంబే హైకోర్టు సీజేగా, తర్వాత 2025 జనవరి నుంచి దిల్లీ హైకోర్టు సీజేగా పనిచేస్తున్నారు. జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్- దిల్లీ యూనివర్సిటీ నుంచి న్యాయ విద్య పూర్తి చేసి పట్నా, ఝార్ఖండ్ హైకోర్టుల్లో ప్రాక్టీస్ చేశారు. 2012లో తొలిసారి ఝార్ఖండ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. రెండేళ్లకు శాశ్వత న్యాయమూర్తి హోదాను పొందారు. 2023 ఏప్రిల్‌లో త్రిపుర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా, తర్వాత 2025 జులై నుంచి తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందిస్తూ వచ్చారు.

# ఇది అస్థిరత యుగం

ప్రస్తుతం ప్రపంచ పరిణామాలు ఎంతో అనిశ్చితి, ఘర్షణలు, తీవ్ర అస్థిరతతో నిండి ఉన్నాయని, ఈ నేపథ్యంలోనే ప్రపంచం ఫ్లక్స్ యుగంలోకి (నిరంతర మార్పులు, తీవ్ర అస్థిరత) వెళ్తోందని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ స్పష్టం చేశారు. ఈ సంక్షోభాలతో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడమే మన ముందున్న ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రపంచంలో రెండు ప్రధాన ఘర్షణలతో పాటు ఇతర ఉద్రిక్తతలు కూడా కొనసాగుతున్నాయని, టారిఫ్స్‌లో అనిశ్చితి వాతావరణం నెలకొందని చెప్పుకొచ్చారు. వీటితో పాటు మార్కెట్‌కు సంబంధించినవి కాని ఇతర అంశాల ప్రభావం కూడా పెరుగుతోందన్నారు. అయితే ఈ సవాళ్లను భారత్ సమర్థంగా ఎదుర్కొంటుందన్న నమ్మకం తనకు ఉందన్నారు. న్యూదిల్లీలో 3 రోజుల పాటు జరిగిన 5వ కౌటిల్య ఎకనామిక్ కాన్‌క్లేవ్ ముగింపు కార్యక్రమంలో జైశంకర్ ఇలా మాట్లాడారు. 'రెసిలెన్స్ ఇన్ ఆన్ ఏజ్ ఆఫ్ ఫ్లక్స్' అనే థీమ్‌తో ఈ సదస్సు నిర్వహించారు. ఇందులో సింగపూర్ మాజీ విదేశాంగ మంత్రి జార్జ్ యోంగ్ బూన్ యో తో కలిసి జైశంకర్ ఇంటరాక్టివ్ సెషన్‌లో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే ఆయన ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులపై కీలక వ్యాఖ్యలు చేశారు.

'ప్రపంచం తీవ్ర మార్పులకు (అస్థిరత) లోనవుతోంది. వివిధ దేశాల మధ్య ఘర్షణలు, ఉద్రిక్తతలు, సుంకాలలో వస్తున్న హెచ్చుతగ్గులు అంతర్జాతీయ పరిస్థితుల్ని అల్లకల్లోలంగా మారుస్తున్నాయి. ఈ క్లిష్ట పరిస్థితుల నుంచి పుట్టుకొస్తున్న సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడమే ప్రస్తుతం మన ముందున్న ప్రధాన కర్తవ్యం'

ప్రస్తుత ప్రపంచ భౌగోళిక, రాజకీయ పరిస్థితులపై అడిగిన ప్రశ్నకు స్పందించిన జైశంకర్- ప్రస్తుత పరిస్థితులు తీవ్ర అస్థిరంగా, అనిశ్చితితో, అల్లకల్లోలంగా ఉన్నాయని వివరించారు. ఇవన్నీ ప్రపంచ దేశాలకు సవాళ్లను విసురుతున్నాయని చెప్పుకొచ్చారు. ప్రస్తుత పరిస్థితుల్ని ఆయన తుపాన్ తరంగాలతో పోల్చారు. అలాంటి అస్థిర సమయం నడుస్తుందన్న ఉద్దేశంతో ఇలా వ్యాఖ్యానించారు. కొవిడ్ మహమ్మారి విజృంభించిన సమయంలో భారత్ ఎన్నో సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని ముందుకు వెళ్లిందని అదే బాటలో ఇప్పుడు కూడా బయటపడతామన్న నమ్మకం ఉందని జైశంకర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రస్తుత ఉద్రిక్తతలు, ఘర్షణల కారణంగా ఇంధనం, ఆహారం, ఎరువులు వంటి కీలక రంగాల్లో ఎదురయ్యే సమస్యల ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి ప్రణాళికలు రూపొందించుకొని దానికి అనుగుణంగా స్పందించాల్సిన అవసరం ఉందన్నారు.

**గ్లోబల్ సౌత్ గళం వినిపించాల్సిందే**

ప్రపంచ వేదికలపై గ్లోబల్ సౌత్ దేశాల గళాన్ని, సమస్యల్ని భారత్ బలంగా వినిపిస్తోందని, ఆ దేశాలు కూడా అదే కోరుకుంటూ భారత్‌పైనే ఎంతో నమ్మకం ఉంచాయని జైశంకర్ వెల్లడించారు. అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఆహారం, ఇంధనం, ఎరువులు, ఇతర ఆర్థిక వనరులకు సంబంధించిన సమస్యలు సాధారణంగానే ఉన్నాయని చెప్పారు. భారత్ ప్రస్తావిస్తున్న అంశాలు కేవలం తమ ప్రయోజనాలకే పరిమితం కాలేదని, ఇది గ్లోబల్ సౌత్‌లోని అనేక దేశాల విస్తృత ప్రయోజనాల్ని కాపాడుతుందని జైశంకర్ వివరించారు. సాధారణంగా అభివృద్ధి చెందుతున్న అలాగే తక్కువ, మధ్య ఆదాయం కలిగిన దేశాల్ని ఇలా గ్లోబల్ సౌత్ పేరుతో పిలుస్తుంటారు. భారత్ కూడా ఇదే కేటగిరీలో ఉంది.

**రష్యా- ఉక్రెయిన్ యుద్ధంపై భారత్ వైఖరి**

ఇదే వేదికగా రష్యా- ఉక్రెయిన్ యుద్ధం సమస్య గురించి కూడా జైశంకర్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ సంక్షోభానికి కేవలం చర్చలు, దౌత్యం ద్వారా మాత్రమే పరిష్కారం సాధ్యమవుతుందని భారత్ తన విధానాన్ని పునరుద్ఘాటించింది. ఈ విషయంలో భారత్ కేవలం మాటలకే పరిమితం కాకుండా, యుద్ధం ముగింపు విషయంలో ఆ దేశాలతో నేరుగా చర్చలు జరుపుతున్నట్లు ఆయన ఇదివరకే స్పష్టం చేశారు. ఇదే సమయంలో నల్ల సముద్రం నుంచి గల్ఫ్ ప్రాంతం వరకు వాణిజ్య నౌకలపై దాడులు జరగడం కూడా ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదని ఆయన హెచ్చరించారు. చివరగా ప్రపంచవ్యాప్తంగా శాంతి భద్రతల పర్యవేక్షణలో బహుపాక్షిక వ్యవస్థల (మల్టీలాటరల్ ఇన్‌స్టిట్యూషన్స్) పాత్ర తగ్గిపోతోందని జైశంకర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇక్కడ ప్రధానంగా ఐక్యరాజ్యసమితి నిశ్చల స్థితిలో ఉండిపోయిందని, ఇందులో సంస్కరణలు జరగకుండా కొన్ని దేశాలు ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు.

# భారత్ కీలక శక్తిగా ఎదుగుతోంది

అంతర్జాతీయ దౌత్య రంగంలో భారత్ అత్యంత కీలకమైన శక్తిగా ఎదుగుతోందని స్విట్జర్లాండ్ ప్రెసిడెంట్ గై పార్మెలిన్ ప్రశంసించారు. గ్లోబల్ గవర్నెన్స్, సాంకేతిక రంగాలలో కూడా న్యూదిల్లీ కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ ఆహ్వానం మేరకు 3 రోజుల అధికారిక పర్యటన నిమిత్తం దిల్లీ విచ్చేసిన ఆయన, ప్రధాని మోదీతో ద్వైపాక్షిక చర్చలు జరిపిన అనంతరం ఉమ్మడి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రపంచం ఒకవైపు రాజకీయంగా, భౌగోళికంగా విభజనకు గురవుతున్న తరుణంలో భారత్ వంటి దేశాలతో భాగస్వామ్యం అత్యంత కీలకం అని మాట్లాడారు. ఏ అంతర్జాతీయ వేదిక అయినా భారత్ చర్చలు, సహకారానికి ఇస్తున్న ప్రాధాన్యాన్ని కూడా తాము అనుసరిస్తామని తెలిపారు. గ్లోబల్ టెక్నాలజీ చర్చల్లో అభివృద్ధి చెందుతున్న దేశాల ప్రాతినిధ్యాన్ని పెంచడంలోనూ భారత్ అసాధారణ నాయకత్వ పటిమను ప్రదర్శించిందని పార్మెలిన్ అన్నారు. ఈ క్రమంలోనే 2026 ఫిబ్రవరిలో న్యూదిల్లీ వేదికగా భారత్ నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమిట్ 2026' గొప్ప విజయాన్ని సాధించిందని ప్రశంసలు కురిపించారు. దీనికి 88 దేశాలు, ఇతర అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయని ఆయన గుర్తు చేశారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించే ఆర్టిఫిషియెల్ ఇంటెలిజెన్స్ (ఊ×) విధానం ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. సాంకేతిక ప్రయోజనాలు కొన్ని దేశాలు, సంస్థలకే పరిమితం కాకుండా ప్రపంచంలోని అన్ని ప్రాంతాలకు చేరేలా భాగస్వామ్యం కల్పించడానికి, ఏఐ పరిశోధనలకు ప్రాధాన్యం ఇవ్వడానికి స్విట్జర్లాండ్ కృషి చేస్తుందన్నారు. 2027 జూన్‌లో జెనీవాలో స్విట్జర్లాండ్ నిర్వహించబోయే తదుపరి గ్లోబల్ ఏఐ



సమిట్‌కు భారత్‌ను కీలక భాగస్వామిగా పరిగణిస్తున్నట్లు పార్మెలిన్ పేర్కొన్నారు. ఇక్కడ ఆమోదించిన 'న్యూదిల్లీ డిక్లరేషన్ ఆన్ ఏఐ ఇంపాక్ట్' మార్గదర్శకాల ఆధారంగానే తాము కూడా ముందుకు సాగుతామని వెల్లడించారు.

**ఎజ్రూా డీల్‌తో సంబంధాలు మరింత బలోపేతం**

భారత్- స్విట్జర్లాండ్ ఆర్థిక సంబంధాల్లో ఇండియా- యూరోపియన్ ఫ్రీ ట్రేడ్ అసోసియేషన్ (జుఖీూా) మధ్య జరిగిన ఎజ్రూా (ట్రేడ్ అండ్ ఎకనామిక్ పార్ట్‌నర్‌షిప్ అగ్రిమెంట్) కీలకంగా మారుతోంది. భారత్, స్విస్, నార్వే, ఐస్‌లాండ్, లిక్టెన్‌స్టెయిన్‌లతో కూడిన జుఖీూా మధ్య కుదిరిన ఈ డీల్ 2025, అక్టోబర్ 1 నుంచే అమల్లోకి వచ్చింది. ఈ డీల్ మొదటి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని, దీని అమలు తీరుపై తాము చాలా సంతోషంగా ఉన్నామని పార్మెలిన్ వెల్లడించారు. ఈ ఒప్పందం అమల్లోకి వచ్చాక స్విస్ కంపెనీల నుంచి ఆసక్తి బాగా పెరిగిందన్నారు. రానున్న సంవత్సరాల్లో భారత్- స్విట్జర్లాండ్ ద్వైపాక్షిక వాణిజ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ఈ ఒప్పందం కీలకంగా మారనుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఇక్కడ ఒకవైపు స్విస్‌కు వినూత్న సాంకేతికతలు, పెట్టుబడి సామర్థ్యం, అంతర్జాతీయ కంపెనీలు ఉండగా, భారత్‌కు భారీ మార్కెట్, అత్యంత నైపుణ్యం కలిగిన మానవ వనరులు, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ ఉన్నాయని ఆయన వివరించారు. ఇలా రెండు వైపులా బలబలాలు ఇరు దేశాలకు మరింత ప్రయోజనం చేకూర్చే అవకాశాల్ని కల్పిస్తున్నాయని స్విస్ ప్రెసిడెంట్ చెప్పుకొచ్చారు. రవాణా, లాజిస్టిక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఫార్మాష్యూటికల్స్, బయోటెక్నాలజీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో స్విస్ కంపెనీలు ఇప్పటికే భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టాయని వెల్లడించారు.

**15 ఏళ్లలో 100 బిలియన్ డాలర్ల పెట్టుబడులు**

ఎజ్రూా కేవలం ఎగుమతి, దిగుమతులపై సుంకాలను మాత్రమే తగ్గించే ఒప్పందం కాదని, దీర్ఘకాలిక పెట్టుబడులు, ఉపాధి, ఆవిష్కరణలు, స్థిరమైన ఆర్థిక వృద్ధికి ఇది పునాది వేస్తుందని స్విట్జర్లాండ్ అధ్యక్షుడు వివరించారు. ఈ వాణిజ్య ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం (ఎజ్రూా) కింద జుఖీూా దేశాలు భారత్‌లో 15 ఏళ్లలో ఏకంగా 100 బిలియన్ డాలర్ల పెట్టుబడుల్ని ప్రోత్సహించడం, ఇందులో భాగంగా సుమారు 10 లక్షల ఉద్యోగాలను కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు స్పష్టం చేశారు. మరోవైపు మోదీ కూడా భారత్- జుఖీూా ఒప్పందాన్ని భారత్- స్విస్ ఆర్థిక సంబంధాల్లో కీలక ముందడుగుగా అభివర్ణించారు. గై పార్మెలిన్ అక్టోబర్ 5 నుంచి 7 వరకు భారత పర్యటనలో ఉండనున్నారు. రాష్ట్రపతి, ప్రధానితో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు.

## భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో స్తబ్ధత ఏర్పడింది

భారత్, అమెరికాల మధ్య కొంతకాలంగా కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలు దాదాపుగా తుది దశకు చేరుకున్నప్పటికీ, ప్రస్తుతం అవి ప్రతిష్టంభనలో ఉన్నట్లు కనిపిస్తున్నాయని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. ఇరు దేశాల మధ్య వాణిజ్యం ప్రస్తుతం భారత్‌కు అనుకూలంగా ఉండటంతో, ఆ లోటును తగ్గించుకోవడానికి అమెరికా తీవ్రంగా ప్రయత్నిస్తోందని ఆమె వెల్లడించారు. సోమవారం ఢిల్లీలో నిర్వహించిన 'మ్యూనిచ్ లీడర్స్ మీటింగ్ 2026'లో ఆమె మాట్లాడారు. "వాణిజ్య ఒప్పందం కోసం ఇరు దేశాలు పట్టుదలగా చర్చలు జరిపాయి. ప్రస్తుతం ఇచ్చిపుచ్చుకునే ధోరణికి అతీతంగా చర్చలను ముందుకు తీసుకెళ్లడం కష్టతరంగా మారింది" అని ఆమె అభిప్రాయపడ్డారు. అయినప్పటికీ, ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లే అవకాశాలను ఇరుపక్షాలు అన్వేషించవచ్చని సూచించారు. భారత్‌తో వాణిజ్యం వల్ల తమకు ఏళ్లుగా నష్టం జరుగుతోందన్న అమెరికా ఆందోళన ఈ చర్చల్లో స్పష్టంగా ప్రతిబింబిస్తోందని ఆమె తెలిపారు. ఫిబ్రవరి 2026లో ప్రకటించిన మధ్యంతర వాణిజ్య ఒప్పంద ముసాయిదా ప్రాతిపదికన ఈ చర్చలు కొనసాగుతున్నాయి. ఇదే క్రమంలో భారత్-యూరోపియన్ యూనియన్ (ఈయూ) మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందాన్ని ఆమె ఒక విజయవంతమైన ఉదాహరణగా పేర్కొన్నారు. యూరోపియన్ కమిషన్ ప్రెసిడెంట్ అభివర్ణించినట్లుగా ఇది 'తల్లి లాంటి ఒప్పందం' అని ఆమె కొనియాడారు. ఈ ఒప్పందంలో భాగంగా భారత్ 92.5 శాతం టారిఫ్ లైన్లను, 97 శాతం వాణిజ్య విలువను అందుబాటులోకి తెస్తే, ఈయూ తన వైపు నుంచి 97 శాతం టారిఫ్ లైన్లను, 99 శాతం వాణిజ్య విలువను విముక్తం చేసిందని ఆమె వివరించారు.

## ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు?



ఎన్నికల సంఘం తీసుకునే నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగా లేదా మెజారిటీ సభ్యుల ఆమోదంతోనే ఉండాలని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు ఎల్లప్పుడూ చట్టప్రకారం నడుచుకోవాలని హితవుపలికింది. ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు వెల్లడించింది. ఎన్నికల సంఘంలో సీఈసీ జ్ఞానేష్ కుమార్ ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఈ వ్యవహారంపై విచారణ పూర్తయ్యే వరకు ఆయనను సస్పెండ్ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం విచారణకు స్వీకరించింది. ఈ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వంతో పాటు కేంద్ర ఎన్నికల సంఘానికి నోటీసులు జారీచేసింది. వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలని నోటీసుల్లో ఆదేశించింది. అలాగే సీఈసీ, ఈసీలకు చట్టపరంగా ఇచ్చిన ప్రాసిక్యూషన్ మినహాయింపు చెల్లుబాటుపై కూడా విచారణ జరుపుతామని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఎన్నికల సంఘం తీసుకున్న ఏ నిర్ణయమైనా చట్టవిరుద్ధమని తేలితే దాన్ని తక్షణమే రద్దు చేస్తామని తేల్చిచెప్పింది. అయితే ఈసీ తీసుకున్న నిర్ణయాలను తాత్కాలికంగా నిలిపివేసేందుకు సుప్రీం నిరాకరించింది.

**ఫారం 6లో మార్పులను ఆమోదించలేదు : సుప్రీం**

మరోవైపు కొత్త ఓటర్ల నమోదు కోసం ఎన్నికల సంఘం (ఈసీ) ఉపయోగించే ఫారం 6లో మార్పులను తాము ఆమోదించలేదని సుప్రీంకోర్టు సోమవారం వెల్లడించింది. 2025లో ఈ ఫారంలో ప్రవేశపెట్టిన అనుబంధ పత్రంపై చెలరేగిన వివాదం నేపథ్యంలో కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అయితే సెప్టెంబర్ 28న విడుదల చేసిన ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం ఈ వివాదంపై స్పందిస్తూ ఫారం 6కు జతచేసిన ప్రకటనను సుప్రీంకోర్టు సమర్థించినట్లు తెలిపింది. "ఎస్ఐఆర్ కోసం ఫారం 6కు జతచేసిన డిక్లరేషన్‌ను సుప్రీంకోర్టు సమర్థించింది. ఎస్ఐఆర్ లేని కాలానికి, నిబంధనల (ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ నిబంధనలు 1960) ప్రకారం వర్తించే ఫారాలను ఉపయోగిస్తాం." అని పేర్కొంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ముందు, సీనియర్ న్యాయవాది వికాస్ సింగ్ వాదనలు వినిపించారు. ఆయన వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం ఈసీకి, కేంద్రానికి నోటీసులు జారీ చేసింది. "ఎన్నికల సంఘం నిర్ణయాలు ఏకగ్రీవంగా లేదా మెజారిటీతో తీసుకోవాలని, అన్ని నిర్ణయాలు ఈ విధంగానే తీసుకున్నారని తాము భావిస్తున్నట్లు" ధర్మాసనం పేర్కొంది.

పట్నాకు చెందిన రాకేశ్ కుమార్ సింగ్ సుప్రీంకోర్టులో ఈ ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. ఎన్నికల సంఘానికి చెందిన అన్ని అధికారాలను సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వ్యక్తిగతంగా వినియోగిస్తున్నారా, లేదా అనేది నిర్ధరించాలని న్యాయస్థానాన్ని కోరారు. ఒక వేళ సీఈసీ ఏకాభిప్రాయం లేదా మెజారిటీతో సంబంధం లేకుండా నిర్ణయాలు తీసుకుంటే, వాటిని అనధికారికమైనవిగా ప్రకటించాలని, ఆయనపై తగిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ధర్మాసనాన్ని కోరారు. అలాగే "ఈ కేసు తుది విచారణ జరిగే వరకు జ్ఞానేశ్ కుమార్ సీఈసీ విధులు చేపట్టరాదని ఆదేశించాలి. ఈ సమయంలో కమిషన్? కార్యకలాపాలు ఎన్నికల కమిషనర్లు సుఖ్?బీర్? సింగ్?, వివేక్? జోషిల ఏకగ్రీవ నిర్ణయం ద్వారా జరగాలి. ప్రధాన ఎన్నికల కమిషనర్? పదవికి ఎవరినైనా నియమించాలంటే, గౌరవనీయ భారత ప్రధాన న్యాయమూర్తితో కూడిన ఒక కమిటీ సిఫారసు మేరకే అది జరగాలని ఆదేశించాలి" అని పిటిషనర్? పేర్కొన్నారు.

**సీఈసీ ద్రోహం చేశారు!**

సుప్రీంకోర్టు తాజాగా ఈ కేసు విషయమై కేంద్రానికి, ఈసీకి నోటీసు జారీ చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ జ్ఞానేశ్?కుమార్?పై తీవ్ర విమర్శలు చేసింది. ఆయన ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్? షాల ఆదేశాలతో రాజ్యాంగానికి తీరని ద్రోహం చేశారని ఆరోపించింది.

"1. ఎస్?ఐఆర్?ను తాత్కాలికంగా, చట్టవిరుద్ధంగా, అజాగ్రత్తగా నిర్వహిస్తున్న తీరు. 2. సుప్రీంకోర్టులోని ప్రస్తుత, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తుల విమర్శలు. 3. సరైన విచారణ లేకుండా విచ్చలవిడిగా ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగించడం. మొదలైన వాటిని ఆధారంగా చేసుకొని, మన గణతంత్ర దేశ సమగ్రతకు కీలకమైన ఎన్నికల సంఘంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి సుప్రీంకోర్టుకు ఒక అద్భుతమైన అవకాశం ఉంది."

'ఎన్నికలు ఎలా నిర్వహించాలనే దానికి తొలి సీఈసీ, దివంగత సుకుమార్? సేన్ మంచి ప్రమాణాలను నెలకొల్పారు. కానీ వాటిలో ఒక్కదాన్నీ ప్రస్తుత సీఈసీ జ్ఞానేశ్ కుమార్? పాటించలేదు. వాస్తవానికి దురుద్దేశపూరితమైన ఫారమ్?-6 సవరణ, అతని నీచమైన, ఏమాత్రం సమర్థించలేని ప్రవర్తనకు ఒక ఉదాహరణ. వాస్తవానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశాల మేరకు జ్ఞానేశ్ కుమార్ అబద్ధాలు చెప్పడమే కాకుండా, చట్టాన్ని ఉల్లంఘించి, రాజ్యాంగాన్ని అక్షర రూపపంలోనూ, స్ఫూర్తి రూపంలోనూ ద్రోహం చేశారు' అని జైరాం రమేశ్ తీవ్ర విమర్శలు చేశారు.

**అలా మొదలైంది!**

ఓ ప్రముఖ వార్తాపత్రిక ఈ సెప్టెంబర్? 25న సంచలన కథనాన్ని ప్రచురించింది. అందులో ఈసీఈ జ్ఞానేశ్ కుమార్ ఇతర ఎన్నికల కమిషనర్లకు తెలియకుండా లేదా వారి ఆమోదం లేకుండా ఎస్?ఐఆర్?పై నిర్ణయాలు తీసుకున్నారని, ఉత్తర్వులు జారీ చేశారని రాసింది. అందుకే కాదు వీటిపై ఎన్నికల కమిషనర్లు సుఖ్?బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి గత 10 నెలల్లో కనీసం 14 సార్లు అభ్యంతరం వ్యక్తం చేశారని పేర్కొంది. దీనిపై స్పందించిన ఎన్నికల కమిషన్?, ఏ సంస్థలో అయినా భిన్నాభిప్రాయాలు ఉండడం సాధారణమేనని పేర్కొంది. ఎన్నికల సంఘం జారీ చేసిన ఉత్తర్వులన్నీ పూర్తి చట్టపరమైన ఆమోదం కలిగి ఉంటాయని చెప్పింది. దీనితో ప్రతిపక్ష పార్టీలు సీఈసీ మండిపడ్డాయి. ఆయన ఏకపక్ష నిర్ణయాలు తీసుకొని పెద్ద ఎత్తున ఓటర్లను తొలగిస్తున్నారని విమర్శించాయి.

# రసవత్తరంగా ముక్కోణపు పోరు

తెలంగాణ రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్? ఆర్?టీసీ)లో పది సంవత్సరాల తర్వాత గుర్తింపు ఎన్నికలు జరుగుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన కార్మిక సంఘాలు గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తూ ముందడుగు వేస్తున్నాయి. ఈ మేరకు పథక రచన చేస్తున్నాయి. దీంతో ఎన్నికల సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. ఈసారి యూనియన్ల మధ్య పోటీ కాకుండా కార్మిక సంఘాలు వేర్వేరు కూటములుగా ఏర్పడటంతో ముక్కోణపు పోరు నెలకొంది. ప్రధానంగా అధికార కాంగ్రెస్ పార్టీ తెలంగాణ వర్కర్స్? యూనియన్? (టీడబ్ల్యూయూ)కు అనూహ్యంగా మద్దతు ప్రకటించింది. దీంతో ఈ ఎన్నికలకు రాజకీయ ప్రాధాన్యం సంతరించుకొంది. మరోవైపు ప్రధాన సంఘం ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ)కు మద్దతు ప్రకటించిన సీపీఐ ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొంది.




### ప్రతి కార్మికుడికి రెండేసి ఓట్లు

ఈ సంవత్సరం నిర్వహించే ఎన్నికల్లో ప్రతి కార్మికుడికి రెండేసి ఓట్లుంటాయి. ఒకటి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి కాగా, మరొకటి రీజియన్ స్థాయి గుర్తింపు సంఘానికి ఓటేస్తారు. వామపక్ష పార్టీల కార్మిక సంఘాల అనుబంధ సంఘాలు ఎంప్లాయీస్? యూనియన్? (ఈయూ), స్టాఫ్? వర్కర్స్? యూనియన్? (ఎస్?డబ్ల్యూఎఫ్?) వేర్వేరు కూటముల్లో ఉన్నాయి. ఈయూతో తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) జట్టు కట్టాయి. ఈ కూటమి నుంచి రాష్ట్ర స్థాయి గుర్తింపు సంఘానికి ఈయూ పోటీపడుతోంది.

### మొత్తం 11 రీజియన్లు

ఆర్టీసీలో మొత్తం 11 రీజియన్లు ఉన్నాయి. వీటిలో వరంగల్?, ఖమ్మం రీజియన్?లలో ఎన్?ఎంయూ, మిగిలిన తొమ్మిది రీజియన్లలో గుర్తింపు సంఘం కోసం టీఎంయూ ఈ కూటమి నుంచి బరిలో నిలిచింది. సీఐటీయూ అనుబంధ ఎస్డబ్ల్యూఎఫ్ తెలంగాణ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ)తో జట్టు కట్టింది. టీడబ్ల్యూయూ రాష్ట్ర స్థాయితో పాటు తొమ్మిది రీజియన్?లలో పోటీ చేస్తోంది. నల్గొండ, ఖమ్మం రీజియన్లలో ఎస్డబ్ల్యూఎఫ్‌కు మద్దతు ఇస్తోంది. టీజేఎంయూ, బహుజన వర్కర్స్ యూనియన్ మరో కూటమిగా ఏర్పడ్డాయి.

### చివరిసారిగా 2016లో ఎన్నికలు

గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు చివరిసారిగా 2016లో జరిగాయి. అప్పట్లో టీఎంయూ ఎన్నికవగా 2019లో గడువు ముగిసింది. ఈ ఎన్నికల్లో 37 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నెల 9న ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్? నిర్వహించనున్నారు. 14, 15 తేదీల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటును ఉపయోగించుకోవచ్చు. 17న ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

### గుర్తింపు ప్రక్రియ ఎలా ఉంటుంది?

ఆర్టీ?సీలో అనేక కార్మిక యూనియన్లు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన వాటిని మాత్రమే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు పొందిన యూనియన్లు రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో పని చేస్తాయి. ఈ రెండింటి ఎన్నికలకు కూడా వేర్వేరు బ్యాలెట్ పత్రాలను ఉపయోగిస్తారు.

### ఆర్టీసీ సంఘాల ఎన్నికల పూర్తి షెడ్యూల్ ఇదే

సెప్టెంబర్ 18 : ఎన్నికల షెడ్యూల్ విడుదల
సెప్టెంబర్ 21 : ఎన్నికల్లో పోటీ చేయడానికి సంఘాల సమ్మతి
సెప్టెంబర్ 22 : యూనియన్లకు ఓటర్ ?లిస్ట్ అందించడంతో పాటు అభ్యంతరాల స్వీకరణ ప్రారంభం
సెప్టెంబర్ 24 : ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు దాఖలు చేసే గడువు
సెప్టెంబర్ 25 : సంఘాలకు తుది ఓటర్ల జాబితా అందజేత
సెప్టెంబర్ 26 : యూనియన్లకు ఎన్నికల గుర్తుల కేటాయింపు, రిటర్నింగ్ అధికారికి తుది ఓటర్ల జాబితా అప్పగింత
సెప్టెంబర్ 29 : యూనియన్లకు నమూనా బ్యాలెట్ పత్రాల సమర్పణ
అక్టోబర్ 09 : ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
అక్టోబర్ 14, 15 : పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్
అక్టోబర్ 17 : ఫలితాల వెల్లడి

# బోగస్ ఫారం-7లపై చర్యలు తీసుకోండి

-మొదటిపేజీ తరువాయి

చంద్రాయణగుట్ట నియోజకవర్గాల్లో కొందరి ఓటు తొలగించేందుకు భారీగా బోగస్ ఫారం-7లు సమర్పిస్తున్నారని ఇటీవల సీఈవోకు కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. దీంతో అప్రమత్తమైన సీఈవో కార్యాలయం రాష్ట్రవ్యాప్తంగా జిల్లాల ఎన్నికల అధికారులకు ఆదేశాలు జరిపింది. ఫారం-7లపై క్షుణ్ణంగా విచారణ జరిపిన తర్వాతే ఓటు తొలగించాలని స్పష్టం చేసింది. ఫారం-7తో పాటు కొత్త ఓటు కోసం ఫారం-6 ఇతర అప్లికేషన్‌లలో కూడా ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం, డిక్లరేషన్ ఇస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సిందేనని సీఈవో స్పష్టం చేశారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌ల గడువు ఎల్లుండితో ముగియనుంది. సర్‌లో భాగంగా తెలంగాణలో అనేక ప్రాంతాల్లో ఎవరి పేర్లు తొలగించాలో పేర్కొంటూ ప్రింటెడ్ ఫారం-7 పత్రాలు లభించాయి. హైదరాబాద్ పరిధిలోని ముషీరాబాద్ నియోజకవర్గంలోని పోలింగ్ బూత్ పరిధిలో పత్రాలు లభించాయని సుదర్శన్‌రెడ్డికి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు ఫిర్యాదు చేశారు.

హైదరాబాద్ బహదూర్‌పుర నియోజకవర్గంలో ప్రింటెడ్? ఫారం-7 పత్రాలు శుక్రవారం దర్శనమిచ్చాయి. తాజాగా శనివారం గోషామహల్ నియోజకవర్గంలోనూ లభించాయి. దీంతో అసలు ఈ పత్రాలు ఎక్కడి నుంచి వస్తున్నాయి. ఎవరు వీటిని ప్రింట్? చేస్తున్నారు. బీఎల్?వోలకు ఎవరు ఇస్తున్నారు. ఎవరైనా ప్రణాళిక ప్రకారం చేస్తున్నారా అనే అనుమానం రాజకీయ పార్టీల్లో నెలకొంది.

ఫారం-6ను వినియోగించి కొత్త ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అదే ఫారం-8 ను వినియోగించి అడ్రస్?లో మార్పులు, పేర్లలో తప్పులను సరిచేసుకొనే అవకాశం ఉంది. అయితే ఫలానా వ్యక్తి ఓటును తొలగించాలని దరఖాస్తు చేసుకోవాలంటే ఫారం-7ను వినియోగించుకోవాల్సి ఉంటుంది. సంబంధిత ఓటరుపై అనుమానం కలిగినా, అది నకిలీ ఓటు లేదా డూప్లికేట్? ఓటు అని సందేహం కలిగినా, సంబంధిత ఓటరు మృతి చెందినా, వ్యక్తులు సంబంధిత చిరునామాలో లేకపోయినా ఇలా అనేక కారణాలతో ఫారం-7 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.



### 29 వేల దరఖాస్తులు

ఇక్కడి లభించిన వాటిలో తొలగించాల్సిన ఓటరు వివరాలను ఫారం-7లో ప్రింట్? చేసి వాటిని కట్టలు కట్టలుగా తెచ్చి బీఎల్?వోలకు ఇస్తుండటంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవగాహన ఉన్న బీఎల్?వోలు ఎవరూ ఇలాంటి ప్రింటెడ్? ఫారాలను తీసుకోరు. ఈ విషయం తెలియని వారు స్వీకరించి ముందుకువెళ్లే అవకాశం ఉంది. అలా జరగడంతోనే ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గ్రేటర్? హైదరాబాద్? పరిధిలోని ఈ తరహా ఘటనలు బయటకు వస్తుండటంతో ఎన్నికల అధికారులు దృష్టి సారించారు. ముషీరాబాద్? నియోజకవర్గంలో జరిగిన ఘటనపై విచారణకు ఆదేశించారులో తెలంగాణలో ఇప్పటి వరకు ఫలానా వారి ఓట్లను తొలగించాలంటూ ఎన్నికల అధికారులకు దాదాపుగా 29 వేల దరఖాస్తులు అందాయి. దీంతో తప్పుడు ఫారాలు సమర్పిస్తే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సీఈవో ఆదేశించారు.

### సీపీకి టీపీసీసీ ఫిర్యాదు

ఓటర్ల జాబితా నుంచి నిజమైన ఓటర్ల పేర్ల తొలగింపునకు ప్రీ-ఫిల్డ్ ఫారం-7 దరఖాస్తుల కుట్రపై హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌కు టీపీసీసీ ఫిర్యాదు చేసింది. టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ పులిపాటి రాజేష్ కుమార్, సభ్యులు ఫిర్యాదు చేశారు. ముషీరాబాద్, బహదూర్‌పురా, గోషా మహల్ నియోజకవర్గాల్లో ఒకే తరహా ఘటనలు జరిగాయని ఆరోపించారు. ప్రీ-ఫిల్డ్ ఫారం-7లను ఎవరు తయారు చేశారు, ఎక్కడ ప్రింట్ చేశారు, ఎవరు పంపిణీ చేశారు? అనే దానిపై దర్యాప్తు చేయాలని కోరారు. ఓటర్ల వ్యక్తిగత ఎన్నికల సమాచారాన్ని ఎక్కడి నుంచి సేకరించారో తేల్చాలని కోరారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయం పాత్రపైనా కూడా దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. ఆరోపణలు నిజమైతే రాజకీయ హోదాతో సంబంధం లేకుండా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

# హైదరాబాద్ - పనాజీ కారిడార్‌లో కీలక అడుగు
# మహబూబ్‌నగర్ టూ రాయచూర్ 4 లైన్ల రోడ్డు రెడీ!

మహబూబ్‌నగర్ టూ రాయచూర్ మార్గం నాలుగు లేన్ల రహదారిగా విస్తరించనుంది. దీనివల్ల ప్రయాణికులు మహబూబ్‌నగర్ నుంచి రాయచూర్‌కు కేవలం ఒక గంటలోపే తమ గమ్యస్థానాన్ని చేరుకోగలుగుతారు. ఈ మార్గం హైదరాబాద్ - గోవా (పనాజీ) సెక్షన్ పరిధిలో మహబూబ్?నగర్? టూ రాయచూర్? (ఎన్?హెచ్?-167) ఒక కీలకమైన మార్గం. మొదట్లో ఇది సింగిల్ లేన్ రోడ్డుగా ఉండేది. కానీ 2012లో దీనికి జాతీయ రహదారి హోదా లభించింది. అప్పుడు కేంద్రం దీనిని 100 అడుగుల వెడల్పుతో రెండు లేన్ల రహదారిగా విస్తరించడానికి నిధులు మంజూరు చేసింది. 2013 నుంచి 2015 మధ్య ఆ విస్తరణ పనులు జరిగాయి.

### గోవా వెళ్లడానికి ఇది ప్రధాన మార్గం

గోవాకు వెళ్లడానికి మూడు ప్రధాన మార్గాలు ఉన్నప్పటికీ, పర్యాటకులు ఎక్కువగా హైదరాబాద్-మహబూబ్‌నగర్-రాయచూర్ మార్గాన్నే ఎంచుకుంటారు. గోకర్ణ, మురుడేశ్వర్, హుబ్లీ, విజయపుర వంటి ప్రాంతాలకు వెళ్లడానికి కూడా ప్రయాణికులు ఇదే మార్గాన్ని ఉపయోగిస్తారు. పెరుగుతున్న వాహనాల రద్దీ, ప్రమాదాల దృష్ట్యా, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది నాలుగు లేన్ల విస్తరణ ప్రాజెక్ట్ కోసం రూ.2,500 కోట్లు విడుదల చేసింది. రూ.2,278.38 కోట్ల విలువైన టెండర్ ఖరారై, ఒక సంస్థకు కాంట్రాక్ట్ అప్పగించింది. ప్రస్తుతం ఈ రహదారిని అత్యాధునిక పద్ధతులతో మొత్తం 200 అడుగుల వెడల్పుతో నిర్మిస్తున్నారు. మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో తమ వ్యవసాయ భూములు, ఇళ్లను కోల్పోయిన 850 మంది నిర్వాసితులకు రూ.123 కోట్ల పరిహారం చెల్లించారు.



### 80.01 కి.మీ పొడవు రహదారి

మహబూబ్‌నగర్‌లో 80.01 కిలోమీటర్ల పొడవైన రహదారిని నిర్మిస్తున్నారు. ఇది పాలమూరు యూనివర్సిటీ (పీయూ) నుంచి ప్రారంభమై మన్యంకొండ, దేవరకద్ర, మరికల్, జక్లేర్, మక్తల్, మగనూరు మీదుగా గూడెబల్లూరు వరకు విస్తరించి ఉంటుంది. ప్రతి 20 మీ.లకు ఒకచోట ఇప్పుడున్న రెండు వరుసల రోడ్డుకు మధ్యలో పీసీఎల్ (ప్రపోజ్డ్ సెంటర్ లైన్) మార్క్ వేస్తూ ఇరువైపులా ముళ్లచెట్లు, పొదలను తొలగిస్తున్నారు. బాగ్‌మార్‌సాబ్ మలుపు నుంచి దేవరకద్ర వరకు, దేవరకద్ర నుంచి మరికల్ వరకు ఉన్న మార్గాల్లో దాదాపు నిర్మాణ పనులు చాలా వరకు పూర్తయ్యాయి. మరికల్ నుంచి మగనూర్ మధ్య పలుచోట్ల మట్టి తవ్వకం, కంకర పరిచే పనులు ప్రారంభమయ్యాయి. 2027 చివరి నాటికి ఈ రహదారిని వినియోగంలోకి తీసుకురావడానికి ప్రణాళిక రూపొందించారు.

## ఏడాదిన్నరలోగా భూసర్వే పూర్తి

నిర్మల్: రాష్ట్రంలో భూసమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలనే ఉద్దేశంతో చేపట్టిన సర్వేను ఏడాదిన్నరలోగా ప్రతీగ్రామంలో పూర్తిచేసే దిశగా చర్యలు చేపడుతున్నామని, ప్రతీ భూ కమతానికి భూధార్ నంబర్ కేటాయిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి నిర్మల్ జిల్లాకేంద్రంలో సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ కలెక్టర్లు, అధికారులతో సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ ఎప్పుడో 125 ఏళ్ల క్రితం భూసర్వే జరిగిందని, ఇప్పటికీ భూ సంబంధిత వివాదాలు కొనసాగుతున్నాయన్నారు.

భూముల సమగ్ర సర్వేతో భవిష్యత్‌లో ఎలాంటి భూ వివాదాలు తలెత్తవని చెప్పారు. ఇందుకు సంబంధించిన సర్వే పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గిరిజన ప్రాంతాల్లో రెవెన్యూ, అటవీ శాఖలకు సంబంధించిన సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో భూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించి, తెలంగాణను గుడిసెలు లేని రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అటవీ సంబంధిత సమస్యల కారణంగా ఇళ్ల నిర్మాణాలు నిలిచిపోకుండా, పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని సూచించారు. అవసరమైతే ఈ అంశంపై రాష్ట్రస్థాయిలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న అధికారులపై మంత్రి సీరియస్ అయ్యారు. సమావేశంలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేశ్‌కుమార్, రెవెన్యూ శాఖ (రిజిస్ట్రేషన్లు, స్టాంపులు) ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి వీపీ.గౌతమ్, నిర్మల్, ఆదిలాబాద్, కుమురంభీమ్ జిల్లాల కలెక్టర్లు భవేశ్ మిశ్రా, రాజర్షిషా, హరిత, ఎమ్మెల్సీ దండె విఠల్, ఖానాపూర్, ముధోల్, బోథ్, ఆసిఫాబాద్, సిర్పూర్ ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు పటేల్, పవార్ రామారావు పటేల్, అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, ఐటీడీఏ పీవో మంద మకరందు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రాభివృద్ధికి సహకరించండి



-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్-అమరావతి ఎక్స్‌ప్రెస్‌వే అంశాలపై చర్చించారు. హైదరాబాద్--శ్రీశైలం ఎన్?హెచ్?? -765పై ఎలివేటెడ్ కారిడార్ కోసం విజ్ఞప్తి చేసినట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

హైదరాబాద్ తూర్పు ప్రాంతంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీకి శాశ్వత పరిష్కారం చూపేందుకు ఎల్బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకు సుమారు 6 కి.మి మేర డబుల్ డెక్కర్ విధానంలో ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే ఎన్‌హెచ్ - 65లో ఎల్బీనగర్--మల్కాపూర్ సెక్షన్‌ను సర్వీస్ రోడ్లతో సహా ఆరు (6o2) లేన్లుగా అభివృద్ధి చేసేందుకు రూ.545 కోట్లతో కేంద్రం అనుమతులు ఇచ్చిందని తెలిపారు. ఎక్కువగా నిర్మాణాలు ఉన్న ప్రాంతాల్లో ఆర్‌ఈ వాల్‌కు బదులుగా వయాడక్ట్ విధానంలో నిర్మాణం చేపట్టాలని ప్రజలు, ప్రజాప్రతినిధుల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని నితిన్? గడ్కరీకి కోమటిరెడ్డి వివరించారు.

### 5 రోప్‌వే ప్రాజెక్టులకు అనుమతివ్వాలని విజ్ఞప్తి

మియాపూర్ -ఎల్బీనగర్ మెట్రో రైలు కారిడార్‌ను రెండో దశలో హయత్‌నగర్ వరకు పొడిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో, మెట్రోతో సమన్వయం ఉండేలా డబుల్?డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు 2026--27 వార్షిక ప్రణాళికలో చోటు కల్పించి మంజూరు చేయాలని గడ్కరీని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. తెలంగాణలో పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాలకు మెరుగైన కనెక్టివిటీ కల్పించేందుకు పర్వతమాల పథకం కింద రూ.1,230 కోట్ల అంచనా వ్యయంతో ఐదు రోప్‌వే ప్రాజెక్టులకు మంజూరు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, నల్గొండ హనుమాన్ హిల్, నాగార్జునసాగర్--నాగార్జునకొండ, పెద్దపల్లి జిల్లా మంథని రామగిరి కోట, నిజామాబాద్ కిల్లా రామాలయం ప్రాంతాల్లో ఈ రోప్‌వేలను ప్రతిపాదించినట్లు తెలిపారు.

### అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి

తెలంగాణ-- ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలను కలిపే హైదరాబాద్--విజయవాడ--మచిలీపట్నం ఎన్?హెచ్? - 65ను ఆరు(6o2) లేన్లుగా విస్తరించే ప్రాజెక్టును వేగవంతం చేయాలని మంత్రి కోమటి రెడ్డి విజ్ఞప్తి చేశారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సీఆర్ఐఎఫ్ పథకం కింద తెలంగాణ రాష్ట్రంలో 33 రహదారి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. మొత్తం 511.68 కి.మి. పొడవుతో చేపట్టనున్న ఈ పనులకు రూ.1,227.75 కోట్ల అంచనా వ్యయం అవుతుందని తెలిపారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రతిపాదించిన ఈ పనులు రాష్ట్రవ్యాప్తంగా సమతుల్య ప్రాంతీయ అభివృద్ధికి ఎంతో కీలకమని, వీటిని పరిశీలించి 2026--27 సీఆర్.ఐఎఫ్ పథకం కింద మంజూరు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కోరారు.

### గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వేకు డీపీఆర్ వేగవంతా చేయాలి

హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డులోని ఉత్తర భాగానికి ఆర్థిక, కేంద్ర మంత్రివర్గ ఆమోదం త్వరగా ఇవ్వాలని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. సంగారెడ్డి--నర్సాపూర్--తూప్రాన్--గజ్వేల్--జగదేవ్‌పూర్--భువనగిరి--చౌటుప్పల్ మార్గంలో 161.518 కి.మీ. మేర నిర్మించనున్న ట్రిబుల్ ఆర్ ఉత్తర భాగానికి భూసేకరణ వ్యయంలో 50 శాతం రాష్ట్ర ప్రభుత్వం భరించేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. ఇప్పటికే 90 శాతానికి పైగా భూములకు అవార్డులు ఆమోదమయ్యాయని, ఎన్.హెచ్.ఏఐ టెండర్లు కూడా ఆహ్వానించినందున వీలైనంత త్వరగా ఆర్థిక, కేబినెట్ ఆమోదాలు ఇవ్వాలని కోరారు.

## సింగరేణి కార్మికులకు కేంద్రం బోనస్

-మొదటిపేజీ తరువాయి

మరింత సమన్వయంతో పనిచేయాలని కోరారు. ప్రస్తుత అవసరాలు, భవిష్యత్తు దృష్ట్యా సింగరేణి కూడా బొగ్గు ఉత్పత్తిని మరింతగా పెంచేందుకు ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. "రానున్న దసరా, దీపావళి, నవరాత్రుల పండుగల కానుకగా సింగరేణి కార్మికులకు ఒక్కొక్కరికి రూ.1,10,250 చొప్పున బోనస్ ఇవ్వాలని నిర్ణయమైనది. దేశానికి వెలుగులు పంచేందుకు పగలు, రాత్రి కష్టపడి పనిచేస్తున్న సింగరేణి కార్మికుల శ్రమ వెలకట్టలేనిది. సింగరేణి బొగ్గు ఉత్పత్తి సంస్థ మాత్రమే కాదు. సింగరేణి పరిశ్రమ మన తెలంగాణ రాష్ట్రానికి కొంగు బంగారం. లక్షలాది కుటుంబాలకు జీవనాధారం. దేశాభివృద్ధిలో, తెలంగాణ అభివృద్ధిలో కీలక భాగస్వామి"



### సింగరేణికి ఇవ్వాల్సిన బకాయిలు విడుదల చేయాలి

దేశ ప్రగతిలో, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి మరింత కీలకపాత్ర పోషించాలని కిషన్? రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం కూడా సింగరేణికి ఇవ్వాల్సిన రూ.60 వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని కోరారు. సింగరేణి కార్మికులకు ముందస్తు దసరా, దీపావళి సుభాకాంక్షలను కిషన్? రెడ్డి తెలియజేశారు.

## బిజినెస్

### 21 నుంచి జియో ఐపీవో!




**న్యూఢిల్లీ, అక్టోబర్ 5 :** దేశంలో అతిపెద్ద ఐపీవోకి రిలయన్స్ ఇండస్ట్రీస్‌నకు చెందిన డిజిటల్ ప్లాట్‌ఫామ్ జియో సిద్ధమవుతున్నది. ఈ నెల 21న ప్రారంభంకానున్న వాటాల విక్రయం ఈ నెల 23న ముగియనున్నదని కంపెనీకి సంబంధించిన వర్గాలు సూచనప్రాయంగా వెల్లడించాయి. ఈ డిజిటల్ సర్వీసును ఈ నెల 28న స్టాక్ మార్కెట్లో లిస్ట్ చేయాలని సంస్థ యోచిస్తున్నది. ఈ నెల చివర్లో లిస్ట్ కానున్న జియో ప్లాట్‌ఫామ్ విలువ 143-146 బిలియన్ డాలర్లు లేదా రూ.12 లక్షల కోట్ల స్థాయిలో ఉంటుందని అంచనా. ఈ ఐపీవోపై కంపెనీ వర్గాలు స్పందించడానికి నిరాకరించాయి. దేశంలో అతిపెద్ద ఐపీవో అయిన జియో ప్లాట్‌ఫామ్ ఐపీవో విలువ 3.8 బిలియన్ డాలర్ల స్థాయిలో ఉంటుందని అంచనా. 2008 తర్వాత రిలయన్స్ గ్రూపు నుంచి వస్తున్న తొలి ఐపీవో ఇదే కానున్నది. ఈ ఐపీవోకి సంబంధించి ఆగస్టు 28న మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్న సంస్థ.. గత నెలలో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది

### యాదాద్రి పవర్‌ప్లాంట్‌కు నైని బొగ్గు



హైదరాబాద్ : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌నకు బొగ్గు కొరత సమస్యను అధిగమించేందుకు టీజీ జెన్‌కో చర్యలు చేపట్టింది. ఒడిశాలోని నైని కోల్‌బ్లాక్ నుంచి రోజుకు 16 వేల టన్ను ల బొగ్గును కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నది. ఇందుకు సంబంధించి టీజీ జెన్‌కో సీఎండీ ఎస్ హరీశ్ సోమవారం ఒడిశాలోని నైని కోల్‌బ్లాక్‌ను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా రైల్వే వ్యాగన్ల సంఖ్యను పెంచడం, స్థానిక రవాణా అడ్డంకులను అధిగమించడంపై సీఎండీ సింగరేణి అధికారులతో ప్రధానంగా చర్చించారు. నైనిలో లభిస్తున్న నాణ్యమైన బొగ్గు యాదాద్రి ప్లాంట్‌నకు అవసరమని, ఈ సరఫరాకు సింగరేణి అధికారులు సహకరించాలని కోరారు.

# మదుపర్లూ.. జర భద్రం..
# అజ్ఞాత సలహాలను ఆచరించకండి

**ఫిన్‌ఫ్లుయెన్సర్లతో జాగ్రత్త**

**ఆకర్షణీయ రాబడులను నమ్మి మోసపోవద్దు**

**హెచ్చరించిన సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే**

**చండీగఢ్ :** అజ్ఞాత వ్యక్తుల సలహాలను అనుసరించవద్దని, ఫిన్‌ఫ్లుయెన్సర్లతో జాగ్రత్తగా ఉండాలని, ఆకర్షణీయ రాబడులను అందజేస్తామన్న మోసపూరిత వాగ్దానాలను నమ్మవద్దంటూ క్యాపిటల్ మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే సోమవారం మదుపర్లను హెచ్చరించారు. పెట్టుబడులపై మదుపర్లలో అవగాహనను పెంచడం కోసం 'ప్రాజెక్ట్ జాగరూక్' కార్యక్రమాన్ని సెబీ దేశవ్యాప్తంగా ప్రారంభించింది. పంజాబ్ విశ్వవిద్యాలయంలో 'ప్రాజెక్ట్ జాగరూక్' ప్రారంభం సందర్భంగా పాండే మాట్లాడుతూ.. కేవలం ఎవరో చెప్పారని ఎవరూ ఎక్కడా పెట్టుబడులకు దిగవద్దని సూచించారు. అందరూ మదుపు చేస్తున్నారని, పెట్టుబడులపై ఏమాత్రం అవగాహన లేకుండానే తొందరపాటు నిర్ణయాలు తీసుకుంటే నష్టపోతారని హితవు పలికారు. పెట్టుబడులపై పూర్తిగా తెలుసుకున్నాకే ఓ



నిర్ణయానికి రావడం ఉత్తమమని సలహా ఇచ్చారు.

**రెగ్యులేటెడ్ ప్రొడక్ట్స్‌ను వాడాలి**

గడిచిన దశాబ్దకాలంలో భారతీయ క్యాపిటల్ మార్కెట్లలో మదుపర్ల సంఖ్య గణనీయంగా పెరిగిందని పాండే గుర్తుచేశారు. ఈ క్రమంలోనే మోసపూరిత పెట్టుబడులపట్ల జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. అందుకే సెబీ నియంత్రణలోని ఉత్పత్తులు, వేదికలు, సంస్థలనే పెట్టుబడుల విషయంలో వినియోగించాలని సూచించారు. ఇక కెరియర్ ఆరంభంలోనే యువత పెట్టుబడులను మొదలుపెడితే లాభదాయకమని, మదుపును కొనసాగిస్తూపోతే చక్రవడ్డీ ప్రయోజనాలు అందుతాయని సలహా ఇచ్చారు.

**11 ప్రాంతీయ భాషల్లో..**

దేశవ్యాప్తంగా మోసపూరిత పెట్టుబడులపై మదుపర్లను అప్రమత్తం చేయడానికి ఇంగ్లిష్, హిందీతోపాటు మరో 11 ప్రాంతీయ భాషల్లోనూ అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్టు పాండే తెలిపారు. టెలివిజన్, ప్రింట్, రేడియో, సినిమా, ఔట్‌డోర్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్స్, సోషల్ మీడియా, ఓటీటీ, వాట్సాప్ సహా ఇతర భౌతిక మార్గాల్లోనూ అమాయక మదుపర్ల ప్రయోజనాల రక్షణకు కృషి చేస్తున్నట్టు వివరించారు. 'ప్రాజెక్ట్ జాగరూక్'లో భాగంగా సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజీలు, డిపాజిటరీలు, భారతీయ మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్లు కలిసి సమన్వయంతో, పరస్పర సహకారంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. అలాగే యూనివర్సిటీల్లోనూ ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ కార్యక్రమాలకు ప్లాన్ చేస్తున్నట్టు సెబీ చీఫ్ పాండే చెప్పారు.

# ఇండిగో విమాన చార్జీలకు రెక్కలు

**న్యూఢిల్లీ :** విమాన టికెట్ల ధరలకు రెక్కలొచ్చాయి. ఇంధన సర్‌చార్జిలను పెంచుతూ దేశీయ విమానయాన దిగ్గజం ఇండిగో తీసుకున్న నిర్ణయంతో విమాన టికెట్ ధరలు పెరిగాయి. ఈ నిర్ణయంతో దేశవ్యాప్తంగా విమాన చార్జీలు రూ.100 నుంచి రూ.350 వరకు పెరుగనున్నాయి. ఈ పెరిగిన ధరలు మంగళవారం నుంచి అమల్లోకి రానున్నట్టు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే అంతర్జాతీయ రూట్లలో ప్రయాణించేవారిపై కూడా మరింత భారం పడనున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా గడిచిన నెల రోజుల్లో ఇంధన ధరలు 14 శాతం వరకు పెరిగాయని, దీంతో సంస్థపై పడుతున ఆర్థిక భారాన్ని తగ్గించుకోవడంలో భాగంగా సర్‌చార్జిని పెంచినట్టు పేర్కొంది. ఏప్రిల్ నెల నుంచి ఇప్పటి వరకు సర్‌చార్జిని పెంచడం ఇది రెండోసారి. 500 కిలోమీటర్ల దూరం వరకు ఫ్యూయల్ సర్‌చార్జిని రూ.375గా వసూలు చేయనుండగా, 501 నుంచి 1,000 కిలోమీటర్ల వరకు రూ.600, 1001-1,500 కిలోమీటర్ల వరకు రూ.900, 1,500-2 వేల కిలోమీటర్ల వరకు రూ.1,150 చొప్పున వసూలు చేయనున్నది. అలాగే 2 వేల కిలోమీటర్ల పైగా ప్రయాణంపై రూ.1,300 ఫ్యూయల్ సర్‌చార్జిని విధిస్తున్నది. భారత్ నుంచి సార్క్ దేశాల మధ్య




నడిచే విమాన సర్వీసుల్లో ఫ్యూయల్ సర్‌చార్జిని రూ.1,000 నుంచి రూ.3 వేల వరకు, ఆఫ్రికా దేశాలకు రూ.6 వేల చొప్పున, యూరప్ సర్వీసులకు రూ.10 వేల చొప్పున వసూలు చేయనున్నది.

# పాకిస్తాన్ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్

పాకిస్తాన్ క్రికెట్‌లో కీలక మార్పు చోటు చేసుకుంది. ఆ దేశ టీ20 జట్టుకు కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేశారు. ఏషియన్ గేమ్స్‌లో తాత్కాలిక సారథిగా వ్యవహరించిన సాహిబ్‌జాదా ఫర్హాన్‌కు పూర్తి స్థాయి టీ20 కెప్టెన్‌గా బాధ్యతలు అప్పజెప్పారు. త్వరలో స్వదేశంలో శ్రీలంకతో జరిగే మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌తో ఫర్హాన్ ఛార్జ్ తీసుకుంటాడు. ఇప్పటివరకు పాక్ టీ20 కెప్టెన్‌గా సల్మాన్ అఘా వ్యవహరించాడు. శ్రీలంకతో టీ20 సిరీస్ అక్టోబర్ 9, 11, 13 తేదీల్లో జరుగుతుంది. ఈ సిరీస్ కోసం పాక్ జట్టును కూడా ప్రకటించారు. ఈ జట్టులో స్టార్ ప్లేయర్లు బాబర్ ఆజమ్, షాహీన్ షా అఫ్రిదికి చోటు దక్కలేదు. అయితే ఈ ఇద్దరినీ ఆతర్వాత పాక్‌లోనే జరిగే వన్డే ట్రై సిరీస్‌కు ఎంపిక చేశారు.

ఈ ట్రై సిరీస్ అక్టోబర్ 18 నుంచి ప్రారంభమవుతుంది. ఈ టోర్నీలో పాక్, శ్రీలంకతో పాటు ఇంగ్లండ్ పాల్గొంటుంది. వన్డే టోర్నీలో పాక్ కెప్టెన్‌గా షాహీన్ అఫ్రిది వ్యవహరిస్తాడు.

**శ్రీలంకతో టీ20 సిరీస్‌కు పాక్ జట్టు**

సాహిబ్‌జాదా ఫర్హాన్ (కెప్టెన్), అబ్దుల్ సమద్, అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, ఫఖర్ జమాన్, హసన్ నవాజ్, మహ్మద్ ఇమ్రాన్, ఖ్వాజా నఫే (వికెట్‌కీపర్), మాజ్ సదాఖత్, నసీమ్ షా, రజావుల్లా, సైమ్ అయూబ్, సల్మాన్ మిర్జా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్.




**వన్డే ట్రై సిరీస్ కోసం పాక్ జట్టు**

షాహీన్ అఫ్రిది (కెప్టెన్), అబ్రార్ అహ్మద్, అరాఫత్ మిన్హాస్, బాబర్ ఆజమ్, ఫహీమ్ అష్రఫ్, ఫఖర్ జమాన్, హారిస్ రౌఫ్, హసన్ నవాజ్, ఘాజీ ఘోరి (వికెట్‌కీపర్), నసీమ్ షా, రజావుల్లా, సాద్ బైగ్ (వికెట్‌కీపర్), సైమ్ అయూబ్, సల్మాన్ అలీ ఆఘా, షాదాబ్ ఖాన్, సుఫియాన్ ముకీమ్

# రేపటి నుంచి మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్

**హైదరాబాద్ :** క్రికెటర్‌గా రాణించాలన్న ఆకాంక్ష ఉన్నప్పటికీ వివిధ కారణాలతో ఆ కెరీర్‌ను కొనసాగించలేక ఇతర రంగాల్లో స్థిరపడిన వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు మాస్టర్స్ క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ హైదరాబాద్ (ఎంసీఏహెచ్)ను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం అధ్యక్షుడు ఎస్పీ రెడ్డి తెలిపారు. ఇందులో తొలి ప్రయత్నంగా ఈ నెల 7వ తేదీ నుంచి రెనోవా మాస్టర్స్ సూపర్ క్రికెట్ లీగ్ (ఎంఎస్ఎల్) నిర్వహిస్తున్నట్టు సోమవారం ప్రకటించారు. ఈ లీగ్ విన్నర్ ట్రోఫీని సినీ నటుడు అలీ ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు జరిగే టోర్నీలో కేఎల్ఆర్ ట్రాన్స్‌ఫార్మర్స్, మా స్పేసెస్, రేజింగ్ బుల్స్, జూపర్ ఎల్ఈడీ బుల్లెట్స్, సన్‌క్రెస్ట్ వారియర్స్, టెర్మినస్, రీట్ మేవరిక్స్ జట్లు బరిలోకి దిగనున్నాయి. 11న ఫైనల్ మ్యాచ్ జరగనుంది.



## స్పోర్ట్స్

### వైభవ్ వెయిట్ చేయాల్సిందే!



**లక్నో:** టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ టీ20 జట్టులో సుస్థిర స్థానం సంపాదించాలంటే మరికొంతకాలం వేచి చూడక తప్పేట్టు లేదు. మంచి ఫామ్‌లో ఉన్న అతడిని వెస్టిండీస్‌తో సిరీస్‌లో ఆడిస్తారా? లేక ఓపెనర్లుగా అభిషేక్-సంజూనే కొనసాగిస్తారా? అని చర్చలు సాగుతున్న నేపథ్యంలో భారత ప్రధాన కోచ్ గౌతం గంభీర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. గౌతీ స్పందిస్తూ.. 'ఇది నాక్కూడా కొత్త అనుభవమే. అతడు (వైభవ్) మంచి ఫామ్‌లో ఉన్నాడు. కానీ జట్టులో కొంతకాలంగా నిలకడగా రాణిస్తున్న నైపుణ్యం కల్గిన ఆటగాళ్లను తీసేసి ఉన్నఫళంగా అతడిని తీసుకోవడం కరెక్ట్ కాదు.

ఈ విషయాన్ని నేను వైభవ్‌కు అర్థమయ్యేలా చెప్పా. అతడు ఇంకొంత కాలం వేచి చూడాల్సిందే. ఒకవేళ వైభవ్‌ను ఆడించాల్సి వస్తే అభిషేక్, సంజూలలో ఎవరిని తప్పించాలన్నది చాలా కష్టమైన ప్రశ్న. గత రెండేండ్లుగా మెరుగ్గా ఆడుతున్న ఈ జోడీని మూడు, నాలుగు మ్యాచుల్లో సరిగ్గా ఆడలేదని, అదీగాక ఒక యువ ఆటగాడి కోసం తప్పించడం సరైన నిర్ణయం కాదు' అని చెప్పుకొచ్చాడు. జట్టు ఎంపిక విషయంలో మ్యాచ్‌కు తగ్గట్టు పరిస్థితులను బట్టి కెప్టెన్, కోచ్ నిర్ణయాలు తీసుకుంటారే తప్ప సోషల్ మీడియా ఒత్తిడితో టీమ్‌ను ఎంపిక చేయబోమని గౌతీ నొక్కిచెప్పాడు.

### తన్మయ్ సిక్సర్.. 174 రన్స్‌కే ఆస్ట్రేలియా ఆలౌట్

**అహ్మదాబాద్ :** సొంతగడ్డపై భారత అండర్-19 జట్టు ఆస్ట్రేలియాకు చుక్కలు చూపిస్తున్నది. ఇదివరకే వన్డే సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసి తొలి టెస్టులోనూ నెగ్గిన జోష్‌లో ఉన్న యువ భారత్.. సోమవారం నుంచి మొదలైన రెండో అనధికారిక టెస్టులోనూ సత్తాచాటింది. యువ స్పిన్నర్ తన్మయ్ బలోడా (6/32) ఆరు వికెట్లతో విజృంభించిన వేళ తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 174 రన్స్‌కే కుప్పకూలింది. అతడికి తోడు అయాన్ ఖాన్ (2/45) సైతం రాణించాడు. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి భారత జట్టు 2 వికెట్లు కోల్పోయి 38 రన్స్ చేసింది.






## రెట్టింపు కామెడీతో 'హుషారు-2'

2018లో విడుదలై విజయవంతమైన 'హుషారు' చిత్రానికి సీక్వెల్ తెరకెక్కుతున్నది. సోమవారం 'హుషారు-2' సీక్వెల్‌ను అధికారికంగా ప్రకటించారు. రాహుల్ రామకృష్ణ, అశోక్ గల్లా, రవి ఆంథోని, దినేష్‌తేజ్, శశిధర్ కోచర్లకోట తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి శ్రీహర్ష దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ఆసక్తినిరేకెత్తిస్తున్నది. నేటి ట్రెండ్‌కు తగినట్లుగా విభిన్న కథాంశంతో ఆద్యంతం కామెడీ ప్రధానంగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నామని దర్శకుడు తెలిపారు. తొలిభాగానికి మించిన రెట్టింపు వినోదంతో ఈ సీక్వెల్‌ను ఉంటుందని, షూటింగ్ పూర్తయిందని, ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయని మేకర్స్ తెలిపారు. ఈ ఏడాది చివరలో చిత్రాన్ని విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: సన్ని ఎం ఆర్, నిర్మాతలు: రాహుల్ వర్మ, కె.వీణా రాణి, కె.హనుమంత్ రాజు, రచన-దర్శకత్వం: శ్రీహర్ష కొనుగంటి

## గ్రిప్పింగ్ హారర్ ఎలిమెంట్స్‌తో 418

ప్రతిష్ఠాత్మక నిర్మాణ సంస్థ మైత్రీమూవీమేకర్స్ నుంచి రానున్న ఇంటెన్స్ హారర్ థ్రిల్లర్ '418'. అగ్ర దర్శకుడు ప్రశాంత్ నీల్ సమర్పిస్తున్న ఈ చిత్రంలో చైత్ర ఆచార్, సూర్యరాజ్, చరణ్ లక్కరాజు, ప్రీతి పగడాల, శశాంక్ పాటిల్ కీలకపాత్రధారులు. కీర్తన్ నాదగౌడ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రం దసరా కానుకగా ఈ నెల 23న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానున్నది. హారర్ మిస్టరీతో ఈ సినిమా సంచలనం సృష్టించడం ఖాయమని, స్టన్నింగ్ విజువల్స్, చిల్లింగ్ పెర్ఫార్మెన్స్, హంటింగ్ స్కోర్, సూపర్ నేచురల్ థ్రిల్స్‌తో గ్రిప్పింగ్ హారర్ ఎక్స్‌పీరియన్స్‌ను ఈ సినిమా అందివ్వబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ దివాకర్, సంగీతం: వెంకీ జీజీ, నిర్మాతలు: నవీన్ యెర్నేని, యలమంచిలి రవిశంకర్.



## భయపెట్టే పోతిరెడ్డిపల్లి

పవన్, మౌనిక, సిరి ప్రధానపాత్రధారులుగా రూపొందుతున్న హారర్ థ్రిల్లర్ 'పోతిరెడ్డిపల్లి'. అశోక్ రొయ్య దర్శకత్వంలో జేరమ్ విష్ణు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రారంభోత్సవం సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. ముహూర్తపు సన్నివేశానికి సీనియర్ నటుడు బాబూమోహన్ క్లాప్ కొట్టగా, ప్రముఖ దర్శకుడు, కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ కెమెరా స్విచాన్ చేశారు. ప్రముఖ దర్శకుడు వీఎన్ ఆదిత్య తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, రాజ్యసభ సభ్యుడు, ఆర్.కృష్ణయ్య, దర్శకుడు వి.సముద్ర, ఓయూ శంకర్ గుండేటి ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. ఆసక్తికరమైన హారర్ థ్రిల్లర్ కథాంశంతో ఈ సినిమా రూపొందుతున్నదని హీరో పవన్ తెలిపారు. ఇరుముడి సాయిస్వరూప్, సునీత మనోహర్, ఆనంద్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈచిత్రానికి సంగీతం: ర్యాప్ రాక్ షకీల్, సమర్పణ: త్రిపుర మీడియా, ఆరాధ్య క్రియేషన్స్.



## 'కాకా' మూవీ.. కీలక పాత్రలో బాలీవుడ్ నటుడు



చిరంజీవి ప్రధాన పాత్రలో, దర్శకుడు బాబీ తెరకెక్కిస్తున్న చిత్రం 'కాకా'. ఈ సినిమా 2027 జనవరి 13న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చిరంజీవి 'కదిరి కాళిదాస్'గా కనిపించనున్నారు. అయితే తాజాగా మేకర్స్ ఈ సినిమా నుంచి ఓ ఆసక్తికర విషయాన్ని వెల్లడించారు. ఈ చిత్రంలో బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేశారు. దర్శకుడు బాబీ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు.'ఓ పవర్‌ఫుల్ పాత్ర కోసం ప్రముఖ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్‌ను 'కాకా' చిత్రబృందం ఎంపిక చేసింది. ఈ సినిమాలో ఆయన అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారు' అని ఆయన పేర్కొన్నారు.



## అప్పులన్నీ తీరిస్తే అదే ఆనందం

ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతున్నారు హీరో కిరణ్ అబ్బవరం. స్వీయ దర్శకత్వంలో ఆయన నటిస్తున్న తాజా చిత్రానికి 'రియాలిటీ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. జాయ్ ఫిల్మ్స్ పతాకంపై సుధాకర్ చాగంటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం మచిలీపట్నంలో చిత్రీకరణ జరుగుతున్నది. సోమవారం టైటిల్‌ను ప్రకటిస్తూ గ్లింప్స్‌ని విడుదల చేశారు. ఇందులో హోటల్‌ను నడుపుకునే ఆనంద్ అనే వ్యక్తిగా కనిపించారు కిరణ్ అబ్బవరం. కుటుంబానికి ఉన్న అప్పులన్నీ తీర్చినరోజే తనకు నిజమైన ఆనందమని చెబుతుంటాడు. మధ్యతరగతి యువకుడి జీవితాన్ని ప్రతిబింబిస్తూ 'రియాలిటీ' టైటిల్‌కు తగినట్లుగా ఆయన పాత్ర సాగింది. డిసెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. దేవికాభట్, శరత్‌కుమార్, సాయికుమార్, రోహిణి, అన్నపూర్ణమ్మ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో, రచన-దర్శకత్వం: కిరణ్ అబ్బవరం.

## సాధారణ టికెట్ రేట్లతోనే 'రణబాలి'

అగ్ర హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడిక్ చిత్రం 'రణబాలి' ఈ నెల 16న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. ఇప్పటికే ఈ సినిమాపై భారీ అంచనాలేర్పడ్డాయి. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో బిజీగా గడుపుతున్నది. ఈ సినిమా టికెట్ రేట్లను పెంచబోమని, సాధారణ రేట్లకే సినిమాను ప్రదర్శించబోతున్నామని మేకర్స్ సోషల్‌మీడియా ద్వారా వెల్లడించారు. ఏపీలో ఈ సినిమా ధరల్ని పెంచబోతున్నారనే వార్తల్ని చిత్రబృందం ఖండించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో టికెట్ రేట్ల పెంపు కోసం ప్రభుత్వాలకు ఎలాంటి దరఖాస్తు చేయలేదని, సినిమా కంటెంట్‌పై తమకు పూర్తి నమ్మకం ఉందని మేకర్స్ ఆ ప్రకటనలో వెల్లడించారు. రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై వై.రవిశంకర్, నవీన్ యెర్నేని ఈ చిత్రాన్ని నిర్మించారు. 8వ తేదీన ట్రైలర్: 'రణబాలి' ట్రైలర్‌ను ఈ నెల 8న విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నదని, విజయ్-రష్మిక ఇంటర్వ్యూలు సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయని మేకర్స్ ఆనందం వ్యక్తం చేశారు.




printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512